RNI NO : TELTEL/2023/89146
Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:209 | గురువారం | 03 సెప్టెంబర్ 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

PRESS

77309 83966 98491 98098



## అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

- భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కమీషన్లు
- వెయ్యి రోజుల్లో రూ.4.50 లక్షల కోట్ల అప్పులు
- రుణ మాఫీ, పెన్షన్లు, ఉద్యోగాలు మోసపూరిత హామీలే
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చార్జిషీట్
- సీఎం రేవంత్ పాలనపై నిప్పులు చెరిగిన కేటీఆర్

2

## కాగితాలమీదే ఆర్టీసీ లాభాలు



- ఆర్టీసీకి రూ. 2,600 కోట్ల బకాయిలు చెల్లించాలి
- హరీష్ రావు డిమాండ్

2

## కుట్టు మిషన్ల కొనుగోలు ప్రక్రియ 7లోపు పూర్తి చేయాలి

- 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 'కళ్యాణ లక్ష్మి' దరఖాస్తులు వేగవంతంగా పరిష్కరించాలి
- బీసీ సంక్షేమ శాఖ సమీక్షలో మంత్రి పొన్నం ఆదేశాలు

3



# రేవంత్ డైవర్షన్ గేమ్..!

## 'రాజీనామా' అస్త్రంతో సీఎం దూకుడు

- ప్రభుత్వ వైఫల్యాలు కేసీఆర్ రాజీనామాతో చెల్లుబాటు అవుతాయా?
- అధికార పార్టీకి చెక్ పెట్టేలా బీఆర్ఎస్ ప్రతివ్యూహం
- ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ఎత్తుగడేనంటున్న ప్రతిపక్షం
- తెలంగాణ ఆత్మగౌరవ కార్డుతో కౌంటర్
- గులాబీ బాస్ వ్యూహాత్మక మౌనం
- సరైన సమయంలో కేసీఆర్ గ్రాండ్ రీ-ఎంట్రీ
- అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీసేలా వ్యూహం
- కేటీఆర్, హరీశ్ రావులతో ఎదురుదాడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:**

ప్రతిపక్ష నేత కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేయడం తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడి రేపుతోంది. పని చేయని ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను చిత్రీకరిస్తూ ఊరూవాడ నిరసనలు చేపట్టాలని సీఎం పిలుపునివ్వడంతో కాంగ్రెస్ రాజకీయ దాడిని మరింత తీవ్రం చేసింది. అయితే ఈ 'రాజీనామా' అస్త్రం వెనుక అసలు లక్ష్యం ఏమిటన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాలు, హామీల అమలు, రైతు సమస్యలు, హైడ్రా కూల్చివేతలు, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలపై ప్రజల్లో జరుగుతున్న చర్చను పక్కదారి పట్టించేందుకే రేవంత్ ఈ ఎత్తుగడకు దిగారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.

**డైవర్షన్ గేమ్ అంటున్న ప్రతిపక్షం**

కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు, రైతుబంధు, రుణమాఫీ, నిరుద్యోగుల సమస్యలు, రైతుల ఇబ్బందులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం బీఆర్ఎస్‌కు ఉంది. ఇదే సమయంలో కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తీసుకురావడం ద్వారా రాజకీయ చర్చను పూర్తిగా మరో దిశకు మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ప్రతిపక్షం వాదిస్తోంది. 'ప్రభుత్వ వైఫల్యాలకు కేసీఆర్ రాజీనామాతో పరిష్కారం ఏమిటి?' అన్న ప్రశ్నను ప్రజల్లోకి తీసుకెళ్లాలని

మిగతా 2వ పేజీలో..

## షోకాజ్ నోటీసులు ఇవ్వడమే తప్పు



- నా కూతురు వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు
- నాపై మాట్లాడిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపైనా చర్యలు తీసుకోవాలి
- బీసీలకు అన్యాయం చేస్తే ఏకమవుతారు
- అధిష్టానానికి చెప్పాల్సింది చెప్పా
- మంత్రి కొండా సురేఖ

2

## గ్లోబల్ సమ్మిట్ రక్ష ఎక్స్‌పోలో భాగస్వాములు కండి

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం
- దేవరకద్ర డీఆర్‌డీఎల్కు ఉచితంగా భూ కేటాయింపు
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 1500 ఎకరాల సేకరణకు రాష్ట్రం ఆమోదం

3





## విమానాశ్రయాల పనులు వేగవంతం చేయండి

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

3

## జన ఆకాంక్షల కేంద్రంగా వెయ్యి రోజుల పాలన

- పేదల అవసరాలు, ఆత్మగౌరవాల మేళవింపుతో సంక్షేమం
- వెయ్యి రోజుల పాలనపై 'ఎక్స్'లో సీఎం రేవంత్ పోస్టు

3



## ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు

3

## జాతీయ జలభద్రతకు ఏకీకృత కార్యాచరణ

- జలభద్రత ఒక ప్రభుత్వ శాఖకే పరిమితం కాకూడదు
- ప్రతి ఆస్తికి 'యూనిక్ ఐడీ' కేటాయించాలి
- జల్ సంచయ్–జన్ భాగీదారీ' సదస్సులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## కాంగ్రెస్ 420 హామీలతో ప్రజా ద్రోహం

- మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు



3



## రికార్డు ధరకు హౌసింగ్ బోర్డు ప్లాట్లు

2

## తుక్కుగూడ నర్సు హత్యపై మహిళా కమిషన్ సుమోటో విచారణ

- డీజీపీకి ఎన్‌సీడబ్ల్యూ లేఖ
- వేగంగా దర్యాప్తు.. నిందితుడిపై కఠిన చర్యలు
- ఫోరెన్సిక్, డిజిటల్ ఆధారాల సేకరణ
- ఏడు రోజుల్లో యాక్షన్ టేకన్ రిపోర్ట్

2





## పేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

- రెవెన్యూ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 :**

తమది పేదవాడి కష్టం తెలిసిన ప్రభుత్వమని, గత ప్రభుత్వం వదిలి వెళ్లిన భారీ అప్పులు, పెండింగ్ బిల్లులను చెల్లిస్తూనే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

మిగతా 2వ పేజీలో..

## తుక్కుగూడ నర్సు హత్యపై మహిళా కమిషన్ సుమోటో విచారణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:**

తుక్కుగూడలో నర్సుపై అత్యాచారం, హత్య ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సుమోటోగా విచారణ చేపట్టింది. ఘటనను తీవ్రంగా పరిగణించిన కమిషన్ తెలంగాణ డీజీపీకి లేఖ రాసింది. కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు ఏడు రోజుల్లో యాక్షన్ టేకన్ రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించింది.

**నిందితుడి నేరచరిత్రపై ఆరా**

నిందితుడిని కస్టడీలోకి తీసుకుని విచారించాలని, ఘటనకు దారితీసిన పరిస్థితులు, హత్యకు గల కారణాలను వెలుగులోకి తీసుకురావాలని ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ సూచించారు. నిందితుడి పూర్వ నేరచరిత్రను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

**ఆధారాల సేకరణకు ప్రాధాన్యం**

అత్యాచారం, హత్య, క్రిమినల్ ట్రెస్‌పాస్‌కు సంబంధించిన బీఎన్ఎస్ సెక్షన్లను కఠినంగా అమలు చేయాలని కమిషన్ స్పష్టం చేసింది. వైద్య పరీక్షలు, పోస్టుమార్టం, ఫోరెన్సిక్, డిజిటల్ ఆధారాలను భద్రపరిచి సమగ్రంగా పరిశీలించాలని సూచించింది. సీడీఆర్‌లతో పాటు ఇతర సాంకేతిక ఆధారాలను సేకరించాలని ఆదేశించింది.

**కుటుంబానికి రక్షణ, న్యాయసాయం**

బాధితురాలి కుటుంబానికి భద్రత కల్పించడంతో పాటు అవసరమైన న్యాయసాయం అందించాలని ఎన్‌సీడబ్ల్యూ సూచించింది. కుటుంబానికి వర్తించే చట్టబద్ధ పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

**ఏడు రోజుల్లో నివేదిక**

దర్యాప్తు పురోగతి, ఫోరెన్సిక్ నివేదికలు, ఛార్జ్‌షీట్ దాఖలు గడువు, కేసు పర్యవేక్షణకు తీసుకున్న చర్యల వివరాలతో ఏడు రోజుల్లో యాక్షన్ టేకన్ రిపోర్ట్ సమర్పించాలని తెలంగాణ పోలీసులను కోరింది. పనిచేసే మహిళల భద్రత, గౌరవం విషయంలో రాజీపడేది లేదని జాతీయ మహిళా కమిషన్ స్పష్టం చేసింది.

## పేదల ఆత్మగౌరవం ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి సచివాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుమారు 3,475 రోజులు పాలించిన గత ప్రభుత్వం రాష్ట్రంపై ఆర్థిక భారాన్ని మోపి వెళ్లినప్పటికీ సంక్షేమం, అభివృద్ధిని ఎక్కడా ఆపకుండా తమ వెయ్యి రోజుల ప్రజా పాలనను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. గతంలో ఆగిపోయిన అభివృద్ధి పనులకు సంబంధించిన అసలైన బిల్లులు, సర్పంచులు, కాంట్రాక్టర్ల బకాయిలను కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలో మరో మూడు లక్షలకు పైగా కొత్త పింఛన్లను మంజూరు చేయనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు.

**4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు**

మొదటి విడతలో మంజూరు చేసిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ. 5 లక్షల సహాయం అందిస్తోంది. త్వరలోనే రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నారు.

**హైదరాబాద్‌లో 'ఇందిరమ్మ టవర్స్'**

పేదలను దూరప్రాంతాలకు పంపకుండా వారు నివసించే నియోజకవర్గాల్లోనే, ఎకరం రూ. 100 కోట్లకు పైగా విలువైన ఖరీదైన స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లోని 20 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రతి నియోజకవర్గానికి సుమారు 600 ఇళ్ల చొప్పున బహుళ అంతస్తుల్లో లిఫ్ట్, మౌలిక వసతులతో నిర్మిస్తున్నారు. పారదర్శక లక్కీ డ్రా విధానం ద్వారా ఎంపిక చేసిన అర్హులైన మహిళల పేరు మీదనే 525 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇంటిని, భూమిలో అన్‌డివైడెడ్ షేర్‌తో రిజిస్టర్ చేస్తారు. దీనికోసం పేదలపై రూపాయి భారం పడదని, ఎలాంటి పైరవీలు, సిఫారసులకు అవకాశం లేదని తేల్చి చెప్పారు.

**రైతు భరోసా & నిరుద్యోగులకు ఊరట**

గత వెయ్యి రోజుల్లో రైతు సంక్షేమానికి రూ. 1.76 లక్షల కోట్లు వెచ్చించామని, సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి వేలాది ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను అందుబాటులోకి తెస్తున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 :**

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆరఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల దగా పాలనపై పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావుతో కలిసి తెలంగాణ భవన్‌లో బుధవారం చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతమే.. వెయ్యి రోజుల పాలన కాదు.. పీడన. జలద్రోహం చేస్తున్న జలగల పాలన అని మండిపడ్డారు. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం కాంగ్రెస్ మేనిఫెస్టో అని అన్నారు. పేదల భూములు నిషేధిత జాబితాలో పెట్టి 30శాతం కవి□షన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు చేయకున్నా ఈ ప్రభుత్వం రూ.4.50లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. కాంగ్రెస్ అసమర్థత ప్రొ మ్యాక్స్, అవినీతి అల్ట్రామ్యాక్స్, అరాచకం ఐమ్యాక్స్ అంటూ విమర్శలు గుప్పించారు. రూ.50వేల కోట్లు రుణ మాఫీ చేస్తామని రూ.20వేల కోట్లు చేశారని, రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్టు పెట్టారని, మాఫీ చేయకుండా 70శాతం మందికి కుచ్చుటోపీ పెట్టారని విమర్శించారు. తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా కేసీఆర్ మారిస్తే కాంగ్రెస్ నాశనం చేసిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో దరిద్రం దండయాత్ర మొదలుపెట్టి వెయ్యి రోజులు అయింది.. రాష్ట్ర సంపదను కొల్లగొట్టే విషయంలో సీఎం, మంత్రులు కొట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు, పదవుల కోసం కీచులాటలు తప్ప ఏం లేదు.. రైతుబంధు బంద్ అయ్యింది.. రాహుల్ బంధు మొదలైంది అని విమర్శించారు. గోదావరి, కృష్ణా జలాల వాటాల్లో రాష్ట్రానికి అన్యాయం జరిగితే మిమ్మల్ని వదిలిపెట్టం అని హెచ్చరించారు. మిస్ వరల్డ్ పోటీలు, మెస్సీ కోసం నిధులు భారీగా ఖర్చు చేస్తారు కానీ రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు పెట్టరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, జాబ్ క్యాలెండర్ పేరిట జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని అన్నారు. ఢిల్లీలో జెన్ జీని వెంటపెట్టుకుని ప్రజాస్వామ్యమని రాహుల్ కొటేషన్లు చెబుతుంటే ఇక్కడ మాత్రం నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర సంపద కోసం మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకున్నారని, ప్రజా పాలన కాదు వెయ్యి రోజుల శని పాలన అని అన్నారు. వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపిస్తున్నారంటూ ఆర్థిక, సామాజిక విధ్వంసం తప్ప చేసిందేవి□ లేదన్నారు. చంద్రబాబుకు గురు దక్షిణగా కృష్ణా, గోదావరి నీళ్లు ఇస్తున్నాడన్నారు. అందాల పోటీలకు పెట్టిన ఖర్చులో పదో వంతు ఖర్చు చేస్తే కాఫర్ డ్యాం కట్టి నీళ్లు ఇయ్యొచ్చని ఇంజిర్లు చెబితే వారికి బెల్టు ట్రీట్‌మెంట్ ఉంటుందని భయపెట్టారని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూల్చినా, చెక్ డ్యాంలు కూలినా బీజేపీ, ఎన్‌డీఎస్ఏ నోరు తెరవకపోవడాన్ని ఆక్షేపించారు. జీఆరఎంబీలో తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎజెండా పెడితే పారిపోతున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూములను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. యూరియా అడిగిన రైతులపై లాఠీచార్జి చేశారు.. కాళేశ్వరంపై కక్ష రైతన్నకు శిక్ష.. మోటర్లకు మీటర్లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ కుప్ప కూలిందన్నారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

# రేవంత్ డైవర్షన్ గేమ్..!

**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్ భావిస్తోంది.

**రాజీనామా అస్త్రంతో దూకుడు**

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారంటూ కొంతకాలంగా కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు రేవంత్ ఇప్పుడు 'రాజీనామా' డిమాండ్‌ను జోడించారు. కేసీఆర్ ప్రజా జీవితానికి దూరంగా ఉన్నారన్న భావనను బలపరిచేందుకు కాంగ్రెస్ ఈ అంశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని చూస్తోంది. ఊరూవాడ నిరసనలకు పిలుపునివ్వడం ద్వారా పార్టీ శ్రేణులను కదిలించడంతో పాటు బీఆర్ఎస్‌పై రాజకీయ ఒత్తిడి పెంచాలన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది.

**తెలంగాణ ఆత్మగౌరవ కార్డుతో కౌంటర్**

రేవంత్ దాడికి బీఆర్ఎస్ భిన్నమైన కోణంలో సమాధానం ఇవ్వాలని చూస్తోంది. కేసీఆర్‌ను కేవలం ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధనతో ముడిపడిన నాయకుడిగా ప్రజల్లో ఉన్న గుర్తింపును మరోసారి ముందుకు తెచ్చే ప్రయత్నం జరగవచ్చు. 'తెలంగాణ కోసం పోరాడిన నాయకుడిని అవమానిస్తున్నారు' అనే సెంటిమెంట్‌ను బలపరచడం ద్వారా రాజీనామా డిమాండ్‌ను వ్యక్తిగత రాజకీయ దాడిగా మార్చే వ్యూహాన్ని బీఆర్ఎస్ అనుసరించే అవకాశం ఉంది.

**గులాబీ బాస్ వ్యూహాత్మక మౌనం**

రేవంత్ విసిరిన సవాల్‌కు కేసీఆర్ వెంటనే స్పందించకపోవడమే ఆయన వ్యూహంలో భాగమని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి.





ముఖ్యమంత్రి సవాలు చేసిన వెంటనే రోడ్డుపైకి వస్తే రేవంత్ వేసిన రాజకీయ ఎజెండాలోనే కేసీఆర్ చిక్కుకున్నట్లవుతుందని పార్టీ నాయకత్వం అంచనా వేస్తోంది. అందుకే ప్రస్తుతం కేటీఆర్, హరీశ్ రావు వంటి సీనియర్ నేతలతో ప్రభుత్వంపై ఎదురుదాడి కొనసాగిస్తూ.. కేసీఆర్ మాత్రం వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారని తెలుస్తోంది.

**సరైన సమయంలో గ్రాండ్ రీ-ఎంట్రీ**

కేసీఆర్ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రావడంపై బీఆర్ఎస్‌లో అంతర్గతంగా కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే రేవంత్ సవాల్‌కు ప్రతిస్పందనగా కాకుండా.. రాజకీయంగా అనుకూలమైన సమయంలో భారీ బహిరంగ సభతో రీఎంట్రీ ఇవ్వాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది. ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేపట్టడం ద్వారా తన రాజకీయ పునరాగమనానికి బలమైన కారణాన్ని చూపించాలన్న ఆలోచన ఉన్నట్లు సమాచారం.

**అసెంబ్లీ వేదికగా చెక్**

సెప్టెంబరులో జరగనున్న శాసనసభ సమావేశాలు బీఆర్ఎస్‌కు కీలక వేదికగా మారే అవకాశం ఉంది. సభకు కేసీఆర్ హాజరైతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నేరుగా నిలదీసే అవకాశం లభిస్తుంది. ఆరు గ్యారెంటీల అమలు, రుణమాఫీ, రైతుల సమస్యలు, నిరుద్యోగం తదితర అంశాలపై గణాంకాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ద్వారా 'పనిచేయని నాయకుడు' అన్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది. రేవంత్ విసిరిన 1,000 రోజుల పాలన సవాల్‌కు సభలోనే సమాధానం ఇవ్వాలని పార్టీ వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

**కేటీఆర్, హరీశ్‌తో ఎదురుదాడి**

కేసీఆర్‌పై రేవంత్ చేస్తున్న వ్యక్తిగత విమర్శలకు ఆయన నేరుగా స్పందించకుండా కేటీఆర్, హరీశ్ రావులను ముందుకు పంపడం బీఆర్ఎస్ వ్యూహంలో మరో కీలక అంశంగా కనిపిస్తోంది. ప్రభుత్వ విధానాలు, హామీల అమలు, ప్రజా సమస్యలపై ఇద్దరు నేతలు ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. అదే సమయంలో క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌ను క్రియాశీలం చేసి కాంగ్రెస్ చేపడుతున్న 'కేసీఆర్ రాజీనామా' ఆందోళనలకు రాజకీయంగా కౌంటర్ ఇవ్వాలని చూస్తోంది.

**రేవంత్ అఫెన్సివ్.. కేసీఆర్ సైలెన్స్**

రేవంత్ రెడ్డి దూకుడైన రాజకీయ అఫెన్సివ్‌తో కేసీఆర్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తుంటే.. కేసీఆర్ మాత్రం తనకు అలవాటైన వ్యూహాత్మక మౌనాన్నే ఆయుధంగా మార్చుకుంటున్నారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజీనామా డిమాండ్ చుట్టూ రాజకీయ చర్చను కొనసాగనిచ్చి, సరైన సమయంలో ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని రీ-ఎంట్రీ ఇవ్వడం ద్వారా మొత్తం నారేటివ్‌ను మార్చాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది. రేవంత్ వేసిన 'పనిచేయని నాయకుడు' ముద్రను తిప్పికొట్టి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల దృష్టిని మళ్లీ నిలిపేలా చేయడమే కేసీఆర్ ముందున్న అసలు సవాలుగా మారింది.

## జాతీయ జలభద్రతకు ఏకీకృత కార్యాచరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 :**

దేశవ్యాప్తంగా చేపడుతున్న ప్రతి జల సంరక్షణ పనిని ఒకే జలభద్రతా ప్రణాళిక పరిధిలోకి తీసుకురావాలని నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి జల సంరక్షణ ఆస్తికి ప్రత్యేక గుర్తింపు ఉండాలని, దాని నిర్వహణకు నిర్దిష్ట బాధ్యతగల సంస్థను కేటాయించడంతోపాటు కొలవగలిగే స్పష్టమైన ఫలితాలను సాధించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో బుధవారం నిర్వహించిన తొలి 'జల్ సంచయ్-జన్ భాగీదారీ' జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. జలభద్రత అనేది కేవలం ఒక ప్రభుత్వ శాఖ లేదా ఇంజినీరింగ్ విభాగానికే పరిమితం కాకూడదని, తాగునీరు, వ్యవసాయ స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ కోసం ఇది ప్రజలందరి భాగస్వామ్యంతో కూడిన ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపునిచ్చారు.

**సమన్వయ లోపం అధిగమించాలి**

ఉపాధి హామీ, పీఎంకేఎస్‌వై, 'కంపా', ఆర్థిక సంఘం, సీఎస్ఆర్ నిధులతో వేర్వేరుగా పనులు చేపట్టడం వల్ల ప్రణాళికల్లో విచ్ఛిన్నం, నిధుల పునరావృతం జరుగుతున్నాయని విమర్శించారు. వీటి స్థానంలో ప్రతి ఆస్తికి 'యూనిక్ ఐడీ' కేటాయించి జియో ట్యాగింగ్ చేయాలని ఆయన ప్రతిపాదించారు.

**తెలంగాణ రికార్డు**

'జల్ సంచయ్-జన్ భాగీదారీ' కింద 2025లో తెలంగాణ అత్యుత్తమ పనితీరు కనబరచడమే కాకుండా దేశంలోని టాప్ 50 జల సంరక్షణ జిల్లాల్లో రాష్ట్రానికి చెందిన 13 జిల్లాలు స్థానం సాధించాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. రాష్ట్రంలో 44,360 చెరువులకు గాను ఇప్పటికే 22,428 జలవనరుల పునరుద్ధరణ పూర్తయినట్లు వెల్లడించారు.

**రూ. 46,110 కోట్ల ప్రణాళికలు**

2026-29 మూడేళ్ల వ్యవధిలో రూ. 46,110.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్తగా 17.28 లక్షల ఎకరాలకు సాగునీటి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. రాష్ట్రంలోని



18 ప్రధాన జలాశయాల్లో పూడిక వల్ల దాదాపు 22.95 శాతం (40.97 టీఎంసీలు) నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని, దీనిని పునరుద్ధరించేందుకు దిగువ మానేరు, మధ్య మానేరు, కడెం ప్రాజెక్టుల్లో ఆదాయ ఆధారిత పూడికతీత పనులను ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు.

**తెలంగాణ ప్రాజెక్టులకు పీఎంకేఎస్‌వై కింద ప్రాధాన్యం**

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు పిఎంకెఎస్‌వై కింద ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యావరణ అనుమతులను నిర్దిష్ట గడువులోగా మంజూరు చేయాలని మంత్రి కోరారు.



## రికార్డు ధరకు హౌసింగ్ బోర్డు ప్లాట్లు

- **కేపీహెచ్‌బిలో గజం భూమి రూ.2.70 లక్షలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 :**

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బి) కాలనీలోని ఓపెన్ ప్లాట్లకు బహిరంగ వేలంలో మరోసారి భారీ ధర పలికిందని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. బుధవారం నిర్వహించిన వేలం పాటలో కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని 16 ఎంఐజీ ప్లాట్లకు సంబంధించి గరిష్టంగా చదరపు గజం భూమి రూ. 2.70 లక్షల రికార్డు ధరకు అమ్ముడు పోయినట్లు వెల్లడించారు. ఈ ప్లాట్ల విక్రయానికి ఆగస్టు 10న నోటిఫికేషన్ విడుదల చేయగా చదరపు గజానికి కనీస ధర రూ.1.60 లక్షలుగా నిర్ణయించారు. వేలంలో తీవ్ర పోటీ నెలకొనడంతో ఒక ప్లాట్ రూ.2.70 లక్షలు, మరొకటి రూ.2.36 లక్షలు, అలాగే మరో రెండు ప్లాట్లు రూ.2.06 లక్షల చొప్పున అమ్ముడయ్యాయి. మొత్తం 19 మంది బిడ్డర్లు పాల్గొన్న ఈ వేలం పాటలో సగటున చదరపు గజం ధర రూ.1.79 లక్షలు పలికింది. ఈ బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.47.14 కోట్ల ఆదాయం సమకూరిందని వైస్ ఛైర్మన్ వివరించారు.

## కాగితాలమీదే ఆర్టీసీ లాభాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 :**

ప్రభుత్వ వేదికలపై ఆర్టీసీ వేల కోట్ల లాభాల్లో ఉందని సీఎం రేవంత్ రెడ్డి గొప్పలు చెబుతున్నారని, కానీ ఆర్టీసీ ఎండీ మాత్రం ప్రభుత్వం నుంచి రూ.2,600 కోట్ల బకాయిలు రావాలని లేఖ రాశారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు విమర్శించారు. కాగితాల మీద ఆర్టీసీ లాభాల్లో ఉందని చెబుతూ క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, విశ్రాంత కార్మికుల జీవితాలను అప్పుల ఊబిలోకి నెట్టారని బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ ప్రభుత్వం 'ప్రజా ప్రభుత్వం' కాదని, కేవలం 'ప్రచార ప్రభుత్వం' అని ధ్వజమెత్తారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఉద్యోగులకు పీఆర్సీ, ఏరియర్స్ అందడం లేదని తెలిపారు. 30-40 ఏళ్ల పాటు సేవ చేసిన సుమారు 18 వేల మంది విశ్రాంత ఉద్యోగులకు నేటికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడం దారుణమన్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇప్పటికే 400 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ సౌకర్యం లేని వీరికి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఆర్సీ ఏరియర్సే చివరి ఆసరాని, వాటిని కూడా ఆపేయడం ప్రభుత్వ అమానవీయ వైఖరికి పరాకాష్ట అని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రూ.2,600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేసి విశ్రాంత కార్మికుల హక్కులను నెరవేర్చాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## షోకాజ్ నోటీసులు ఇవ్వడమే తప్పు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితా పటేల్ వ్యాఖ్యలతో నెలకొన్న వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీకి వెళ్లిన కొండా సురేఖ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సుస్మితకు పెళ్లయిందని, ఆమె స్వతంత్రంగా జీవిస్తున్నారని తెలిపారు. ఆమెను మాట్లాడొద్దని చెప్పే హక్కు తనకు లేదన్నారు.

**షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పు**

తన కుమార్తె వ్యాఖ్యలను తాను సమర్థించడమూ, ఖండించడమూ చేయనని సురేఖ తెలిపారు. ఆమె మాట్లాడిన విషయాలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. అసలు తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే తప్పని పేర్కొన్నారు. తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసుపైనే స్పందించానని, తుది నిర్ణయం అధిష్టానానిదేనని చెప్పారు.

**తనపై మాట్లాడిన వారిపైనా చర్యలు**

తనపై విమర్శలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపైనా చర్యలు తీసుకోవాలని సురేఖ డిమాండ్ చేశారు. తనపై మాట్లాడిన వారు బలవంతంగా వచ్చి వ్యాఖ్యలు చేశారని అన్నారు. వారి వెనుక ఎవరున్నారో తనకు తెలుసని, పేర్లు చెబితే వివాదం మరింత ముదురుతుందని పేర్కొన్నారు. వారికీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు.

**బీసీలకు అన్యాయం చేస్తే ఏకమవుతారు**

తన భర్త మున్నూరు కాపు, తాను పద్మశాలి అని సురేఖ తెలిపారు. తెలంగాణలో బీసీలకు గణనీయమైన ఓటు బలం ఉందన్నారు. బీసీ మహిళనైన తనకు ఒక న్యాయం, ఇతర సామాజిక వర్గాలకు చెందిన నేతలకు మరో న్యాయం చేస్తారా అని ప్రశ్నించారు. తనపై ఏకపక్షంగా చర్యలు తీసుకుంటే బీసీలు ఏకమవుతారని హెచ్చరించారు.

**పదవిలో కొనసాగించాలని విజ్ఞప్తి**

తాను తన శాఖను సమర్థంగా నిర్వహిస్తున్నానని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఉన్నానని సురేఖ తెలిపారు. తన పదవికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరినట్లు చెప్పారు. ఖర్గే, మీనాక్షి నటరాజన్ పార్టీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని వెల్లడించారు. కేసీ వేణుగోపాల్‌ను కలవాలని ప్రయత్నించినా ఆయన బిజీగా ఉండటంతో అపాయింట్‌మెంట్ దొరకలేదన్నారు.



**రేవంత్‌పై ముందుగా చర్యలు తీసుకోవాలి**

అంతకుముందు ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా ప్రశ్నలు సంధించారు. 'పదేళ్లు ఆయనే సీఎం' అని రేవంత్ ఎలా అంటారని ప్రశ్నించారు. పార్టీ లైన్ దాటి ఆయన చేసిన వ్యాఖ్యలపై ముందుగా వివరణ కోరాలని అన్నారు. తన కుమార్తె మాట్లాడిన విషయాలకు తనపై చర్యలు తీసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. ఎమ్మెల్యే టికెట్లు ఎవరికి ఇవ్వాలనేది రేవంత్ రెడ్డి ఎలా నిర్ణయిస్తారని నిలదీశారు.

**అధిష్టానానికి లేఖలు**

ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు లేఖలు రాసినట్లు సురేఖ తెలిపారు. తనకు చెప్పాల్సిన విషయాలన్నీ పార్టీ పెద్దలకు చెప్పానని, ఇక అధిష్టానం తీసుకునే నిర్ణయాన్ని బట్టి తన తదుపరి ఆలోచన ఉంటుందని స్పష్టం చేశారు.

# గ్లోబల్ సమ్మిట్ రక్ష ఎక్స్‌పోలో భాగస్వాములు కండి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'తో పాటు 'రక్షణ ఎక్స్‌పో2026'కు హాజరుకావాల్సిందిగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. బుధవారం దిల్లీలో కేంద్ర మంత్రితో భేటీ అయిన సీఎం సదస్సు నిర్వహణ, రాష్ట్రంలోని పలు రక్షణ రంగ ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఈ సమ్మిట్ జరగనుందని, అందులో భాగంగా నిర్వహించే 'రక్షణ ఎక్స్‌పో2026'ను ప్రారంభించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రి హాజరై మార్గనిర్దేశం చేస్తే వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు

**రక్షణ ఎక్స్‌పో భాగస్వామ్యం**

ఎయిర్‌షో నిర్వహణకు గగనతల అనుమతులతోపాటు భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాల ప్రదర్శనలు ఉండేలా సహకరించాలని కోరారు. త్రివిధ దళాల ఉన్నతాధికారులు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రతినిధులు ఈ ఎక్స్‌పోలో పాల్గొనేలా చూడాలన్నారు. హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు డీఆర్‌డీవో ల్యాబ్‌లు తమ సాంకేతికతను ప్రదర్శించేలా ప్రోత్సహించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

**డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు భూ కేటాయింపు**

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ చేపట్టనున్న ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని టీజీఐఐసీ ద్వారా 33 సంవత్సరాల కాలానికి, సంవత్సరానికి ₹1 నామమాత్రపు లీజు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం తెలియజేశారు.

**ఆదిలాబాద్ విమానాశ్రయం**

విమానాశ్రయం కోసం ఇప్పటికే 750 ఎకరాలు సేకరించగా రక్షణ శాఖ విజ్ఞప్తి మేరకు మిగిలిన 750 ఎకరాలు (మొత్తం 1500 ఎకరాలు) కూడా సేకరించి ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేష్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

# విమానాశ్రయాల పనులు వేగవంతం చేయండి

- **రక్షణ, పౌర విమానయాన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయండి**
- **ఆదిలాబాద్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో వసతులు కల్పించండి**
- **కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**దిల్లీ, సెప్టెంబర్ 2 :**

ఆదిలాబాద్, మామూనురు(వరంగల్) విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మామూనురు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి ఇచ్చామని తెలిపారు. దిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో(మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రన్ వే ఫైనలైజ్‌కు సంబంధించి రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. మామునూరు ఎయిర్‌పోర్టు టెండర్లను రెండు వారాల్లో పిలిచి డిసెంబరు నాటికి ఖరారు చేసి పనులకు అదే నెలలో శంకుస్థాపన చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. తెలంగాణలో ఛాపర్ల ద్వారా హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హెలీ టూరిజంతో రాష్ట్రంలో పర్యాటక రంగం మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుందని సీఎం తెలియజేశారు. హుస్సేన్ సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ భేటీ

- **పలు కీలక అంశాలపై చర్చ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో బుధవారం వరుస సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలపై ఆయా శాఖల కార్యదర్శులతో ఆయన విస్తృతంగా చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కటికితాల శ్రీనివాస్, రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్‌లను సీఎస్ వేర్వేరుగా కలిశారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి కటికితాల శ్రీనివాస్‌తో జరిగిన భేటీలో తెలంగాణలో పట్టణాభివృద్ధి, నివాస గృహాల నిర్మాణం, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.రహదారుల రవాణా శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్‌తో సమావేశమై రాష్ట్రంలో రహదారి అనుసంధానతను పెంచడం, జాతీయ రహదారుల విస్తరణ, రవాణా మౌలిక వసతుల అభివృద్ధిపై సమీక్షించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మెరుగైన సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు ఈ సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్‌ది అరాచక పాలన

- **త్వరలో బీజేపీ ప్రజా ప్రభుత్వం ఖాయం**
- **పరకాల అమరధామం స్ఫూర్తితో నిరంకుశ సర్కార్‌పై పోరాటం**
- **బీజేపీ కార్యకర్తలు, కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యంపై దాడి**
- **బీఆరఎస్ కుటుంబ పాలన.. కాంగ్రెస్ 'బ్రదర్స్ అండ్ కంపెనీ' పాలన**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**భువనగిరి, సెప్టెంబర్ 2 :**

దక్షిణ భారత జలియన్‌వాలా బాగ్‌గా చరిత్రకెక్కిన పరకాల మారణకాండలో నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి అసువులు బాసిన వీరుల త్యాగాలు చిరస్మరణీయమని, ఆ స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రజావ్యతిరేక, దౌర్జన్య పాలనపై రాజీ లేని పోరాటం సాగిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు స్పష్టం చేశారు. పరకాల అమరధామంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించేందుకు హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర అధికారిక ప్రతినిధి రాణి రుద్రమ, తదితరులతో కలిసి ఆయన బయలుదేరారు. ఈ క్రమంలో మార్గ మధ్యంలో భువనగిరిలో బీజేపీ శ్రేణులతో కలిసి ఆయన అల్పాహార సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కక్షసాధింపు చర్యల్లో అక్రమ అరెస్టులను ఎదుర్కొని, మెజిస్ట్రేట్ ద్వారా బెయిల్‌పై విడుదలైన స్థానిక కార్యకర్తలను పరామర్శించారు. అనంతరం భువనగిరిలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.




**బీజేపీ శ్రేణులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం**

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ కార్యకర్తలు, నాయకులు, పార్టీ కార్యాలయాలపై విచ్చలవిడిగా దాడులకు తెగబడుతున్నాయని, పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడి ఇంట్లోకి చొరబడి ఆయన తల్లిపై కూడా దాడి చేయడం కాంగ్రెస్ గూండాగిరికి పరాకాష్ట అని రామచందర్‌రావు దుయ్యబట్టారు. దళితులు ఆరాధ్యదైవంగా భావించే సంత్ రవిదాస్ చిత్రపటంపై నల్లరంగు పూసి అవమానించడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి భౌతిక దాడులకు తావులేదన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి**

గతంలో పశ్చిమ బెంగాల్‌లో నాటి అధికార పార్టీ ఏ విధంగానైతే ప్రతిపక్షాలపై, ప్రజలపై హింసాత్మక దాడులకు పాల్పడిందో అదే తరహా హింసాత్మక రాజకీయాలను తెలంగాణలో కాంగ్రెస్ పునరావృతం చేస్తోందని రామచందర్ రావు విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో దౌర్జన్యాలకు స్వస్తి పలికి బీజేపీని ప్రజలు ఎలా ఆదరించారో తెలంగాణలోనూ కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజలు అదే గతి పట్టిస్తారన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు, మిగిలి ఉన్న సుమారు 750 రోజుల వ్యవధిలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

**పోరు బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ మాత్రమే**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక కుటుంబం మాత్రమే బాగుపడింది తప్ప ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ 'బ్రదర్స్ అండ్ కంపెనీ'గా మారి రాష్ట్రాన్ని దోచుకుంటోందని రామచందర్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ కుటుంబ పాలనను, కాంగ్రెస్ దోపిడీని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అందుకే రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి, సమగ్ర అభివృద్ధికి ఏకైక ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ముఖాముఖి పోరాటం ఉంటుందని, ప్రజల ఆశీస్సులతో బీజేపీ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కుట్టు మిషన్ల కొనుగోలు ప్రక్రియ 7లోపు పూర్తి చేయాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:**

మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే కుట్టు మిషన్ల పథకం దరఖాస్తులు, కొనుగోలు, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటివరకు 1,80,170 దరఖాస్తులు అందగా, ఈ నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. 7వ తేదీలోపు ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియ పూర్తి చేసి, 15 తర్వాత ప్రీబిడ్ నిర్వహించాలని మంత్రి సూచించారు.

**గురుకులాలపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకులాల్లో 22 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్న నేపథ్యంలో మిగిలిన వాటికి భవనాలు, స్థలాలపై ఈ నెల 15లోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. యూనిఫాంలు, షూస్, ఇతర మౌలిక సదుపాయాల పరిస్థితిపైనా నివేదిక కోరారు. బీసీ కుల సంఘాల కార్పొరేషన్ల చైర్మన్లకు కార్యాలయాలు, మౌలిక సదుపాయాలు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

**పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి**

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కళ్యాణ లక్ష్మి పథకంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించి లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించాలని సూచించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో పోటీ పరీక్షలు, నైపుణ్య శిక్షణకు మెరుగైన విధానాలను రూపొందించాలని ఆదేశించారు.



**గీత కార్మికులకు రక్షణ కిట్లు**

శిక్షణ పూర్తి చేసిన గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను త్వరగా అందించాలని సూచించారు. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది గీత కార్మికులు ఉండగా, 40 వేల మంది శిక్షణ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. నీరా కేఫ్‌కు 7వ తేదీలోపు, నందనం ప్రాజెక్టుకు 15లోపు రీటెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

**ధోబీఘాట్ల ఏర్పాటుకు ప్రణాళిక**

ప్రతి నియోజకవర్గంలో అధునాతన ధోబీఘాట్ ఏర్పాటు చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. తొలి దశలో హుస్నాబాద్, హుజురాబాద్, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## జన ఆకాంక్షల కేంద్రంగా
# వెయ్యి రోజుల పాలన

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 :**

జన ఆకాంక్షలే కేంద్రంగా త్యాగాల ఆశయాలే ఇంధనంగా సాగిన వెయ్యి రోజుల ప్రజా ప్రస్థానం ఇది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలన సందర్భంగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. పేదల అవసరాలను, వారి ఆత్మగౌరవాలను మేళవించి సంక్షేమం అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర దీర్ఘకాలిక భవితను, బిడ్డల ఉపాధిని మేళవించి అభివృద్ధి చేసి చూపిస్తున్నామన్నారు. సకల వర్గాల సామాజిక న్యాయాన్ని, సమాన అవకాశాలను మేళవించి సాగిస్తున్న పాలన వెయ్యి రోజుల ఈ ప్రయాణం అని ఆయన పేర్కొన్నారు. నాలుగు కోట్ల ప్రజల ఆశీస్సులు, లక్షలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తల అండతో తెలంగాణను విశ్వ వేదికపై విజయపతాకగా నిలిపే వరకు అవిశ్రాంతంగా ఈ కృషిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రయాణంలో తోడుగా, నీడగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మీతో ఈ అనుబంధం నా గుండెల్లో శాశ్వతంగా నిలిచి ఉంటుంది అని సీఎం రేవంత్ అన్నారు.

## ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్

**దిల్లీ, సెప్టెంబర్ 2 :**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహా నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా దిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సాగు నీటి ప్రాజెక్టులు, ఔటర్ రింగు రోడ్డు వంటి అభివృద్ధి పనులు, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలతో పాలనపై చెరగని ముద్ర వేసిన నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అని అన్నారు. కార్యక్రమంలో మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, ఎం.అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 420 హామీలతో
# ప్రజా ద్రోహం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయిందని, ఇది తెలంగాణ సమాజాన్ని ప్రతీ విషయంలోనూ మోసం చేసిన '420' ప్రభుత్వమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దిల్లీలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, 420 సబ్‌గ్యారెంటీల పేరుతో ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం, గత వెయ్యి రోజుల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. హామీలు నెరవేర్చకపోగా రాష్ట్రాన్ని రూ.13 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశారని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులు, పీఆర్సీ, ఆరు డీఏలను నిలిపివేసి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సరైన క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించకుండానే ఈహెచ్ఎస్ పేరుతో జీతాల నుంచి కోతలు విధించడం దుర్మార్గమని ఆయన ధ్వజమెత్తారు.

**మహిళలు, వృద్ధులు & నిరుద్యోగులు, రైతాంగం, విద్యా రంగం**

మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులువితంతువులకు రూ.4,000 పెన్షన్ హామీల ముసుగులో మోసగించారని ఆరోపించారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. రూ.2 లక్షల పూర్తిస్థాయి రుణ మాఫీ చేయకుండా రైతులను నమ్మించి గొంతు కోశారని, రైతు భరోసా బకాయిలు దాదాపు రూ.57 వేల కోట్లకు చేరాయని తెలిపారు. విద్యా రంగానికి సంబంధించి రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. బీసీ సంక్షేమానికి కేటాయించిన రూ.60 వేల కోట్లను విడుదల చేయకపోగా కుల గణన పేరుతో నాటకమాడుతూ అన్యాయం చేశారని మండిపడ్డారు. వెయ్యి రోజుల పాలనపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాల పరిమితి ముగిసిన తర్వాత కాంగ్రెస్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## స్వదేశీ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి కావాలి

- **డీఆర్ డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి**
- **హైదరాబాద్‌లో రాఘవ ఏరోస్పేస్ ప్రారంభం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 2 :**

భారతదేశ రక్షణ తయారీ రంగం గణనీయమైన ప్రగతిని సాధించిందని, దేశీయంగా ఉత్పత్తి చేసే ఆయుధాలను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి మన దేశం రూపాంతరం చెందిందని డెవలప్‌మెంట్ కమ్‌ప్రొడక్షన్ భాగస్వామి, డీఆర్డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన రాఘవ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఏడీపీఎల్)ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆత్మనిర్భర్ భారత్' చొరవ కింద కేంద్ర ప్రభుత్వం రక్షణ బడ్జెట్‌లో స్వదేశీ తయారీ కోసం ₹1.39 లక్షల కోట్లను కేటాయించిందని తెలిపారు. ఆర్మేనియా దేశం తన రిపబ్లిక్ డే పరేడ్‌లో మన దేశీయ ఆయుధ వ్యవస్థలను ప్రదర్శించడం గర్వకారణమన్నారు. రాఘవ ఏరోస్పేస్ సంస్థ కేవలం దేశీయ మార్కెట్‌పైనే కాకుండా అంతర్జాతీయ ఎగుమతులపై దృష్టి సారించాలని సూచించారు.

**కంపెనీ విశేషాలు**

ఆర్ఏడీపీఎల్ సంస్థ ఏరోస్పేస్, రక్షణ, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగాల్లో ఆర్ అండ్ డీ, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, కాంపోజిట్ స్ట్రక్చర్స్‌పై పనిచేస్తుంది. దీని వద్ద అత్యాధునిక క్లీన్ రూమ్, మైక్రోవేవ్ టెస్టింగ్, కాంపోజిట్ తయారీ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. పెరిడాట్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌తో కలిసి మేల్300 జాయింట్ వెంచర్‌ను ప్రకటించింది. ఇది 300 కిలోల పేలోడ్, 30 గంటల ఓర్పుతో 30,000 అడుగుల ఎత్తు వరకు ఎగిరే స్వదేశీ డ్రోన్. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లిఖిత్ రెడ్డి పొంగులేటి మాట్లాడుతూ దేశీయ రక్షణ రంగానికి అవసరమైన ఉత్పత్తులను అందించడంతో పాటు అంతర్జాతీయ ఎగుమతి మార్కెట్లలో ముందంజలో ఉండటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.





# నేపాల్‌లో మళ్లీ వర్షాలు

- ఉప్పొంగుతున్న మూడు ప్రధాన నదులు

**ఖాట్మాండ్, సెప్టెంబర్ 2 :**

నేపాల్‌కు మరోసారి వరద ముప్పు పొంచి ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా మూడు ప్రధాన నదులలో నీటి మట్టాలు డేంజర్ మార్క్‌ను దాటాయి. నేపాల్ వరద అంచనా విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 6 గంటల సమయంలో సున్ కోషి, బుధి గండకి, మహాకాళి నదులలో నీటి మట్టాలు హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. లామ్‌జంగ్ జిల్లాలోని మార్స్యాంగ్డి నదిలో కూడా నీటి మట్టం మంగళవారం అర్ధరాత్రి డేంజర్ మార్క్ దాటిందని అధికారులు వెల్లడించారు. ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో నిరంతరం వర్షాలు కురుస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బుధవారం నాటికి నేపాల్, టిబెట్‌లలో కలిపి మరణాల సంఖ్య 1,130కి పెరిగింది. ఇప్పటివరకు 1,113 మృతదేహాలకు పోస్టుమార్టం, చట్టపరమైన గుర్తింపు ప్రక్రియలు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. 95 మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు. గుర్తింపు లేని 911 మృతదేహాల వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఇప్పటివరకు 6,541 మందిని రక్షించగా 4,858 మంది గల్లంతయ్యారు. 7,912 మంది సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు.



# భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో పురోగతి

- ఈ నెలాఖరులో అమెరికా పర్యటనకు పీయూష్ గోయల్
- పరస్పర ప్రయోజనకర వాణిజ్య సంబంధంపై దృష్టి
- వాణిజ్యానికి మించి సాంకేతికత, పెట్టుబడులపై సహకారం
- 'ప్యాక్ట్ సిలికా'తో పెట్టుబడులకు ఊతం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2:**

భారత్‌అమెరికా దేశాలు న్యాయమైన, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య సంబంధాన్ని నిర్మించేందుకు సన్నిహితంగా పనిచేస్తున్నాయని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య అవగాహనపై ఇప్పటికే గణనీయమైన పురోగతి సాధించామని వెల్లడించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ ఈ నెలాఖరులో అమెరికా పర్యటనకు వెళ్లనున్నట్లు చెప్పారు.

**వాణిజ్య చర్చలు కొనసాగింపు**

ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 66వ వార్షిక సమావేశంలో మాట్లాడిన సెర్గియో గోర్.. భారత్‌అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య అవగాహనతో పాటు పలు అంశాల్లో వాస్తవమైన పురోగతి సాధించామని తెలిపారు. జీ20 చర్చల నేపథ్యంలో పీయూష్ గోయల్ అమెరికాతో చర్చలను కొనసాగిస్తారని చెప్పారు.

**అన్ని రంగాల్లో సహకారం**

ఇరు దేశాల మధ్య పురోగతి వస్తువుల వాణిజ్యానికే పరిమితం కాలేదని గోర్ అన్నారు. సాంకేతికత, పెట్టుబడులు, ఆవిష్కరణలు సహా దాదాపు అన్ని రంగాల్లో భారత్, అమెరికా కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

**'ప్యాక్ట్ సిలికా'తో పెట్టుబడులకు ఊతం**

ఈ ఏడాది భారత్, అమెరికా 'ప్యాక్ట్ సిలికా' డిక్లరేషన్‌పై సంతకం చేశాయని గోర్ తెలిపారు. ఆవిష్కరణలకు అనుకూలమైన నియంత్రణ వ్యవస్థ ఏర్పాటుకు ఇది కీలక ముందడుగని అన్నారు. ఇరు దేశాల కంపెనీలు పరస్పరం సరిహద్దులు దాటి పెట్టుబడులు పెట్టుకునేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. కొత్త తరం పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు కూడా మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

# ఘనంగా 'జాతీయ సైబర్ జాగరూకతా దివస్'

- 438 అవగాహనా కార్యక్రమాలు
- టీజీసీఎస్‌బీ హెచ్చరిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 2:**

పౌరుల్లో సైబర్ అవగాహనను పెంచడం, సురక్షితమైన డిజిటల్ పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 'జాతీయ సైబర్ జాగరూకతా దివస్' ఘనంగా నిర్వహించారు.. ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా డిజిటల్ పేమెంట్స్, ఆన్లైన్ షాపింగ్ ఫ్రాడ్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ వంటి అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా TGCSB తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రత్యేక ప్రచార సామగ్రిని అన్ని పోలీసు స్టేషన్లకు అందించింది. లా అండ్ ఆర్డర్ పోలీసులు, సంబంధిత విభాగాల అధికారులు ఈ డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 438 కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుల్లో దాదాపు 82,573 మంది పౌరులు పాల్గొన్నారు.

**బాధితులు వెంటనే స్పందించాలి**

ఆన్‌లైన్ షాపింగ్ చేసే సమయంలో విక్రేతలను, వెబ్‌సైట్లను సరిచూసుకోవాలని, అపరిచిత లింక్‌లను క్లిక్ చేయవద్దని పోలీసులు సూచించారు. ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే గోల్డెన్ అవర్ (కీలక సమయం)లో వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా www.cybercrime.gov.in పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని టీజీసీఎస్‌బీ పేర్కొంది.

# ఖర్గేకు అవమానంపై ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఆగ్రహం

- 'శుద్ధీకరణ'ను తీవ్రంగా ఖండించిన ఎంపీలు
- 8న రాష్ట్రపతిని కలవాలని నిర్ణయం
- 7న ఇందిరా భవన్‌లో కార్యాచరణపై భేటీ
- బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 :**

రాజ్యసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో చోటుచేసుకున్న ఘటనపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యులు, సీనియర్ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఖర్గే పర్యటన అనంతరం శుద్ధీకరణ చర్యపై ఎస్సీ, ఎస్టీ పార్లమెంటు సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన కేవలం ఖర్గేను వ్యక్తిగతంగా అవమానించడమే కాదని, మొత్తం ఎస్సీ, ఎస్టీ సమాజం గౌరవం, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా వారు అభివర్ణించారు. సమానత్వం, వ్యక్తిగత గౌరవం, అంటరానితనం నిర్మూలన వంటి రాజ్యాంగ సూత్రాలకు ఇలాంటి చర్యలు విరుద్ధమన్నారు. ఈ అంశంపై ఎస్సీ, ఎస్టీ పార్లమెంటు సభ్యులు దిల్లీలో బుధవారం సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై న్యాయం జరిగేలా, బాధ్యులపై తగిన చర్యలు తీసుకునేలా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జోక్యం చేసుకోవాలని ఈ ఎంపీలు కోరేందుకు 8వ తేదీన రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరాలని నిర్ణయించారు. రాష్ట్రపతికి అనుకూలమైన ఇతర తేదీ, సమయం కుదిరినా ప్రతినిధి బృందం ఆమెను కలిసి ఈ అంశాన్ని స్వయంగా వివరించనుంది.

**ఇందిరా భవన్‌లో 7న కీలక భేటీ**

రాష్ట్రపతిని కలిసే ముందు తదుపరి కార్యాచరణకు సంబంధించి రోడ్ మ్యాప్ రూపొందించేందుకు 7వ తేదీ ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలందరూ సమావేశం కావాలని నిర్ణయించారు. అనంతరం 8న రాష్ట్రపతిని కలిసి ఈ అంశాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లనున్నారు.



**రాజ్యాంగ విలువల పరిరక్షణకు పోరాటం**

రాజ్యాంగం కల్పించిన సమానత్వం, గౌరవం, హక్కులను పరిరక్షించేందుకు ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ అంశాన్ని అత్యున్నత రాజ్యాంగ స్థాయికి తీసుకెళ్లి న్యాయం సాధించే వరకు సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. నాగర్‌కర్నూల్(ఎస్సీ) నియోజకవర్గం ఎంపీ డామల్లు రవి ఈ వ్యవహారంపై రాష్ట్రపతికి లేఖ సమర్పించారు. తగిన జోక్యం చేసుకుని, బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. సమావేశానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ జార్ఖండ్ ఇన్‌చార్జి కె.రాజు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ససారం ఎంపీ మనోజ్ కుమార్, తురా ఎంపీ సలెంగ్ ఎ.సంగ్మా, కోరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఫతేగఢ్ సాహిబ్ ఎంపీ అమర్ సింగ్, టోంక్‌సవాయ్ మాధోపూర్ ఎంపీ హరీశ్ చంద్ర మీనా, వరంగల్ ఎంపీ కడియం కావ్య, బారాబంకీ ఎంపీ తనూజ్ పునియా తదితరులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

# రామ మందిర నిర్వహణ అద్భుతంగా సాగింది

- చిన్నపాటి సమస్యలు మినహా ఇబ్బందుల్లేవు
- తొలి సీఈవోగా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా
- విరాళాల వ్యవహారంపై కొనసాగుతున్న దర్యాప్తు
- 5,585 దరఖాస్తుల్లో మిశ్రా ఎంపిక

**అయోధ్య, సెప్టెంబర్ 2:**

అయోధ్య రామ మందిర నిర్వహణ, పరిపాలన ఇప్పటివరకు అత్యంత అద్భుతంగా సాగిందని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కొత్త సీఈవోగా నియమితులైన రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా అన్నారు. అక్కడక్కడా ఎదురైన చిన్నపాటి సమస్యలు మినహా ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. కొన్ని అంశాలపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందని, వాటి ఫలితాల కోసం వేచి చూడాల్సి ఉందన్నారు.

**బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తా**

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు నాయకత్వం వహించిన జితేంద్ర మిశ్రాను రామ మందిర ట్రస్ట్ తొలి సీఈవోగా నియమించింది. ఆలయ నిర్వహణ, పరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఈ పదవిని కొత్తగా ఏర్పాటు చేశారు. అప్పగించిన బాధ్యతలను ట్రస్ట్ మార్గదర్శకత్వం, తన బృందం సహకారంతో సమర్థంగా నిర్వహించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని మిశ్రా తెలిపారు.

**5,585 దరఖాస్తుల్లో ఎంపిక**

ఆలయ విరాళాల దుర్వినియోగ ఆరోపణల నేపథ్యంలో సీఈవో నియామక ప్రక్రియ చేపట్టారు. మొత్తం 5,585 దరఖాస్తులు అందగా.. ఏఐ ఆధారిత స్క్రీనింగ్, మాన్యువల్ మూల్యాంకనం అనంతరం అభ్యర్థులను ఎంపిక చేశారు. చివరకు ముగ్గురితో కూడిన తుది జాబితా నుంచి జితేంద్ర మిశ్రాను ఎంపిక చేశారు. రిటైర్డ్ జస్టిస్ ప్రమోద్ కోహ్లీ నేతృత్వంలోని కమిటీ ఈ ప్రక్రియను పర్యవేక్షించింది.

**39 ఏళ్లకు పైగా వైమానిక దళంలో సేవలు**

ఉత్తరప్రదేశ్‌లోని దేవరియా జిల్లాకు చెందిన జితేంద్ర మిశ్రా 2026 ఏప్రిల్‌లో వైమానిక దళం నుంచి రిటైరయ్యారు. 39 ఏళ్లకు పైగా సేవలందించిన ఆయన ఫైటర్ పైలట్‌గా 3,000 గంటలకు పైగా విమాన ప్రయాణ అనుభవం పొందారు. కమాండ్, వ్యూహాత్మక ప్రణాళిక, పరీక్షా విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్‌లో సేవలకు గుర్తింపుగా సర్వోత్తమ యుద్ధ సేవా మెడల్‌తో పాటు అతి విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ అందుకున్నారు.



**పరిపాలనపై దృష్టి**

ఆలయ విరాళాల సొమ్ము దుర్వినియోగం ఆరోపణల కేసులో ఎనిమిది మంది అరెస్టు కాగా, ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కొత్త సీఈవో నియామకంతో ఆలయ పరిపాలనను మరింత వ్యవస్థీకృతం చేయడంపై ట్రస్ట్ దృష్టి సారించింది. జితేంద్ర మిశ్రా సైనిక రంగంలో పొందిన విస్తృత పరిపాలనా, నాయకత్వ అనుభవం ఈ బాధ్యతల్లో ఉపయోగపడుతుందని భావిస్తోంది.

# మహిళలను ఇళ్లకే పరిమితం చేయలేం

- గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలను అంగీకరించం: సతీషన్
- మహిళలు అన్ని రంగాల్లో చురుగ్గా ఉండాలి
- మత పెద్దల ఆదేశాలతో బాలికలను నిర్బంధించలేం
- కాంగ్రెస్, సీపీఎంలపై రాజీవ్ చంద్రశేఖర్ విమర్శలు

**తిరువనంతపురం, సెప్టెంబర్ 2:**

మహిళలు ఇళ్లకే పరిమితం కావాలంటూ కేరళ గ్రాండ్ ముఫ్తీ కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేగింది. మహిళలు ప్రజాజీవితంలోకి వస్తే తీవ్ర నష్టం జరుగుతుందని, వారు విధేయులుగా ఇళ్లలోనే ఉండాలని ఖురాన్ చెబుతోందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను కేరళ ప్రతిపక్ష నేత వీడీ సతీషన్ తీవ్రంగా ఖండించారు. ఈ వైఖరిని తమ పార్టీ, ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించవని స్పష్టం చేశారు.

**మహిళలు అన్ని రంగాల్లో ఉండాలి**

మహిళలు సమాజంలోని అన్ని రంగాల్లో చురుగ్గా పాల్గొనాలన్నదే తమ ప్రగతిశీల వైఖరి అని సతీషన్ అన్నారు. మహిళలు అణచివేతకు గురై ఇళ్లకే పరిమితం కావాలన్న భావన 19వ శతాబ్దపు ఆలోచనగా అభివర్ణించారు. మహిళలు ప్రజా, సామాజిక జీవితంలో స్వేచ్ఛగా పాల్గొనాలని స్పష్టం చేశారు.

**ఇస్లాం బోధనలకు విరుద్ధం**

గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలు ఇస్లాం బోధనలకు సరైన ప్రతిరూపం కాదని సతీషన్ అన్నారు. ప్రవక్త మహమ్మద్ తొలి భార్య ప్రముఖ వ్యాపారవేత్తగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. అలాగే ఆయిషా 'బ్యాటిల్ ఆఫ్ ది క్యామెల్'లో కీలక పాత్ర పోషించారని, రాణి బిల్కిస్ పాలకురాలిగా ఉన్నారని పేర్కొన్నారు.

**బీజేపీ నుంచి విమర్శలు**

గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ కూడా స్పందించారు. మత పెద్దల ఆదేశాలతో కేరళ బాలికలను మధ్యయుగపు నిర్బంధంలోకి నెట్టలేరని అన్నారు. కాంగ్రెస్, సీపీఎంలు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. మహిళలు పితృస్వామ్య భావజాలాన్ని వ్యతిరేకించాలని చెబుతున్న రాహుల్ గాంధీ.. గ్రాండ్ ముఫ్తీ వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదని ప్రశ్నించారు.



# 'నన్ను ఉరితీయక ముందే నిన్ను విముక్తి చేస్తా''..

- భార్య ముషాల్‌కు విడాకులు ఇవ్వాలని నిర్ణయం
- తీహార్ జైలు నుంచే అఫిడవిట్ దాఖలు
- 'ఆమె కొత్త జీవితాన్ని ప్రారంభించాలి'
- 2009లో వివాహం.. ఇద్దరి మధ్య 20 ఏళ్ల వ్యత్యాసం

**శ్రీనగర్, సెప్టెంబర్ 2:**

జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్‌ఎఫ్) ఉగ్రవాది యాసిన్ మాలిక్ తన భార్య ముషాల్ మాలిక్‌కు విడాకులు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించాడు. ఢిల్లీలోని తీహార్ జైలులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఆయన శ్రీనగర్‌లోని టాడా/పోటా కోర్టులో 25 పేజీల అఫిడవిట్ దాఖలు చేసినట్లు సమాచారం. అందులో భార్య నుంచి విడిపోవాలనే నిర్ణయాన్ని వెల్లడించాడు.

**కొత్త జీవితాన్ని ప్రారంభించాలి**

తన భార్య మిగిలిన జీవితాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో భారంగా గడపడం తనకు ఇష్టం లేదని యాసిన్ మాలిక్ పేర్కొన్నాడు. ఆమె గౌరవంగా, ఆశతో జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. తనను ఉరితీయడానికి ముందే ఆమెను వివాహ బంధం నుంచి విడిపించాలని నిర్ణయించుకున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నాడు.

**పలు కేసుల్లో శిక్ష**

ఉగ్రవాదానికి నిధులు సమకూర్చిన కేసులో యాసిన్ మాలిక్ తీహార్ జైలులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. ఆయనపై పలు పాత కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. 1990లో కాశ్మీరీ పండిట్ నర్సు సరళా భట్ హత్య, అదే ఏడాది వైమానిక దళ సిబ్బంది హత్య కేసులు వాటిలో ఉన్నాయి. సరళా భట్ హత్యలో తనకు సంబంధం లేదని, తనను తప్పుగా ఇరికిస్తున్నారని మాలిక్ గతంలో ఖండించాడు.



**2005లో పరిచయం.. 2009లో వివాహం**

యాసిన్ మాలిక్, ముషాల్ మాలిక్ 2005లో పాకిస్థాన్‌లో తొలిసారి కలుసుకున్నారు. కాశ్మీర్ సమస్యపై పాకిస్థాన్ వెళ్లిన సమయంలో ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాలిక్ ఫైజ్ కవిత్వాన్ని చదివాడు. ఆ కార్యక్రమానికి తన తల్లితో కలిసి హాజరైన ముషాల్.. అనంతరం మాలిక్ వద్ద ఆటోగ్రాఫ్ తీసుకుంది. ఆ పరిచయం క్రమంగా పెరిగి 2009లో వివాహానికి దారితీసింది. ఇద్దరి మధ్య దాదాపు 20 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉంది.

# సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన






**శెనార్తి మీడియా, వికారాబాద్:**

సైబర్ జాగృత దివస్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రతి నెల మొదటి గురువారం నిర్వహించే సైబర్ జాగృత దివస్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, నకిలీ ఆఫర్లు, సోషల్ మీడియా తదితర మార్గాల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని, అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే సందేశాలు, లింకులు, ఆఫర్లను నమ్మవద్దని తెలిపారు."వినాయకుడు మనకు నేర్పే పాఠాలు – సైబర్ విజ్ఞానం కలిగి ఉండండి" అనే సందేశంతో రూపొందించిన ఈ పోస్టర్‌లో సైబర్ నేరాల నుంచి రక్షణకు పలు సూచనలు చేశారు. అపరిచిత కాల్స్, మెసేజ్‌లు, లింకులు, అనుమానాస్పద ఆఫర్లను నమ్మకూడదని, OTP, UPI PIN, ATM PIN, CVV, పాస్‌వర్డ్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, పత్రాలను ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా పంచుకోవాలని సూచించారు.అలాగే సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి,www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ కాజోల్ జైస్వాల్, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఆర్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ స్టడీస్ స్టడీ మెటీరియల్ అందజేత



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

విద్యార్థుల అభ్యసనకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ సూచించారు. రాష్ట్ర సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. పాఠశాల సోషల్ స్టడీస్ ఉపాధ్యాయురాలు ఉమారాణి రూపొందించిన మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయురాలు నీరజ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాల్లోని అన్ని అంశాలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా నిపుణుల సూచనలతో ఈ స్టడీ మెటీరియల్‌ను రూపొందించినట్లు నీరజ తెలిపారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అందించే స్టడీ మెటీరియల్, ఇతర సమాచారాన్ని జాగ్రత్తగా భద్రపరచుకొని చదువులో ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులకు మెటీరియల్ అందించేందుకు కృషి చేసిన ఉమారాణిని ప్రధానోపాధ్యాయురాలు అభినందించారు. పాఠశాలకు అవసరమైన సహకారం, ప్రోత్సాహం అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు నీరజకు ఉమారాణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన అధినేత జన్మదిన వేడుకలు




**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

జనసేన పార్టీ అధినేత జన్మదిన వేడుకలను శంకరపట్నం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి జనసేన అధినేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కంటే రాకేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో బక్కి అనిత్ కుమార్, పంజాల యశ్వంత్, కూచన శ్రీనివాస్, హరీష్, శీను, శివప్రసాద్, శ్రీకాంత్, సురేష్, మొగిలి, సాయి, విష్ణువర్ధన్, అనిల్, మణికంఠ, తిరుపతి, అరవింద్‌తో పాటు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం




**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండల ప్రజలు జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి సూచించారు. సెప్టెంబరు 3 నుంచి 12వ తేదీ వరకు హుజురాబాద్ కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, చిన్నపాటి కేసులు, ఎక్సైజ్ కేసులను పరస్పర అవగాహనతో రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల ఖర్చులు, సమయం ఆదా కావడంతో పాటు త్వరితగతిన న్యాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ఇరుపక్షాల మధ్య శాంతి, సామరస్యం నెలకొనేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. 'రాజీ మార్గమే రాజమార్గం' అనే భావనతో అర్హత కలిగిన కేసుల్లో సంబంధిత వ్యక్తులు ముందుకు వచ్చి తమ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం సంబంధిత గ్రామ పోలీస్ అధికారి లేదా కేశవపట్నం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

## హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**



హమాలీలకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభల్లో తీర్మానం చేయనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య తెలిపారు. కరీంనగర్‌లో ఈనెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న మహాసభల కరపత్రాన్ని గన్నేరువరం మండల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహాసభల తొలిరోజు ఈనెల 6న నిర్వహించే బహిరంగ సభకు మండలంలోని హమాలీలు, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, సహాయ కార్యదర్శులు పిప్పల కనకయ్య, కూన మల్లయ్య, ఏఐటీయూసీ మండల నాయకులు బుర్ర శ్రీను, ముడికే శ్రీను, దాసరి శ్రీనివాస్, కోర్వి మల్లయ్య, మంగరపు రవి, ఒల్లాల రవి, దుర్మట్ల మల్లేశం, ఒల్లాల కనకయ్య, మునికంటి రాములు, శ్రీధర్, నర్సింగాపూర్ రవి, ఇనుకొండ శివరాం, జిల వేణు, సందన వేణి, రాములు, దాసరి ఐలయ్య, దాసరి ఆంజనేయులు, గూడెల్లి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు యువకులు అరెస్ట్

- **గీసుగొండ సిఐ డి.విశ్వేశ్వర్**
- **రెండు ద్విచక్ర వాహనాలు, వెయ్యి రూపాయలు నగదు స్వాధీనం**
- **వాహన తనిఖీల్లో అనుమానం.. విచారణలో చోరీల బాగోతం**

**శెనార్తి మీడియా, గీసుగొండ** : దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, వెయ్యి రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ గురువారం వివరాలు వెల్లడించారు. కాశి బుగ్గ ప్రాంతానికి చెందిన సముద్రాల సురేష్ మచ్చాపూర్ గ్రామ శివారులో లక్ష్మి గణపతి సిమెంట్ బ్రిక్స్ ఇండస్ట్రీ నిర్వహిస్తున్నారు. ఆగస్టు 29న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పరిశ్రమలోని ఓ గది తాళం పగులగొట్టి సెల్ఫ్‌లో భద్రపరిచిన పదివేల రూపాయలు నగదును అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ఊకల్ క్రాస్ రోడ్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు సిమెంట్ బ్రిక్స్ ఇండస్ట్రీలో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించారు. మరింత లోతుగా విచారించగా మిల్స్ కాలనీ, దుగ్గొండి పోలీస్ స్టేషన్ పరిధుల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు కూడా పాల్పడినట్లు వెల్లడైనట్లు సిఐ విశ్వేశ్వర్ తెలిపారు. అరెస్టయిన వారిలో శంభుని పేటకు చెందిన మహమ్మద్ సమీర్ (18), గిరిప్రసాద్ నగర్‌కు చెందిన మహమ్మద్ అజీమ్ (19) ఉన్నారు. వారి నుంచి హోండా షైన్ ద్విచక్ర వాహనం (TS-03-EL-8461), హోండా యాక్టివా స్కూటీ (TS-03-EA-4537), పది వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.అరెస్టయిన ఇద్దరినీ గురువారం న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.






## 16లోగా ఓటరు క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయాలి

**సంగారెడ్డి, సెప్టెంబర్ 2( సమయం న్యూస్)** ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)లో భాగంగా ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి పౌరుడు తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. 2026 ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. జాబితాలో పేరు నమోదు, వివరాల సవరణ లేదా అభ్యంతరాల కోసం సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ERO) వద్ద సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయాలని కోరారు. ERO నిర్ణయంపై అసంతృప్తి ఉంటే మొదటి అప్పీల్‌గా జిల్లా మేజిస్ట్రేట్‌కు, అనంతరం రెండవ అప్పీల్‌గా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (CEO)కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను పరిశీలించి SIR ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.

## రోడ్డుపై కొండచిలువ కలకలం



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం కన్నాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ప్రధాన రహదారిపై కొండచిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు, బాటసారుల్లో కలకలం రేగింది. రహదారిపైకి వచ్చిన కొండచిలువను చూసి పలువురు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపటి తర్వాత కొండచిలువ రహదారి నుంచి కిందికి వెళ్లిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊరట చెందారు.

## కేటీఆర్ కు సీడ్ గణేశ్ విగ్రహం అందజేత

**శెనార్తి మీడియా, హైదరాబాద్:** వినాయక చవితిని పర్యావరణహితంగా జరుపుకోవాలని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పిలుపునిచ్చింది. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సహ వ్యవస్థాపకుడు రాఘవేందర్ సీడ్ గణేశ్ విగ్రహాన్ని అందజేశారు. సహజ మట్టి, కోకోపీట్, కొబ్బరి పీచుతో తయారుచేసిన ఈ విగ్రహాల్లో వేప, చింత వంటి స్థానిక వృక్షాల విత్తనాలు ఉంటాయని తెలిపారు. పూజల అనంతరం విగ్రహాన్ని కుండిలో లేదా ఇంటి ఆవరణలో ఉంచి నీరు పోస్తే, విగ్రహం కరిగిపోయి విత్తనాలు మొలకెత్తి మొక్కగా ఎదుగుతాయని వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగులతో నీటి వనరులు కలుషితమవుతున్న నేపథ్యంలో ప్రజలు సీడ్ గణేశ్‌లను ప్రోత్సహించాలని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కోరింది. ఇటీవల మెగాస్టార్ చిరంజీవి కూడా సీడ్ గణేశ్ ప్రచారాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది.

## ఇన్ స్టాగ్రామ్ లో స్పేర్ పార్ట్స్ పేరుతో రూ.5.30 కోట్ల మోసం




**శెనార్తి మీడియా, ఆదిలాబాద్ :** ఇన్‌స్టాగ్రామ్‌లో మొబైల్ స్పేర్ పార్ట్స్, యాక్సెసరీస్ విక్రయాల పేరుతో దేశవ్యాప్తంగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేరగాడిని ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. రాజస్థాన్‌కు చెందిన ప్రకాశ్ కుమార్ (22)ను అదుపులోకి తీసుకుని రూ.లక్ష నగదు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. నిందితుడు 19 రాష్ట్రాల్లో సుమారు 140 మందిని మోసం చేసి రూ.5.30 కోట్లకు పైగా కాజేసినట్లు దర్యాప్తులో తేలింది. ఇచ్చోడకు చెందిన మొబైల్ వ్యాపారి నుంచి స్పేర్ పార్ట్స్ పంపిస్తామని నమ్మించి రూ.2.18 లక్షలు వసూలు చేసిన ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని గుర్తించారు. సోషల్ మీడియాలో తక్కువ ధరలకు వస్తువులు ఇస్తామని చెప్పే వారిని నమ్మి ముందస్తుగా డబ్బులు చెల్లించవద్దని ఎస్పీ సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.



# పాత్రికేయ కురువృద్ధులు నందూరి

## నేడు నందూరి రామమోహనరావు వర్ధంతి

తెలుగు పత్రికలతో పరిచయం ఉన్న వారికి నందూరి రామమోహనరావు పేరు సుపరిచితమే. అయన సమాజం పట్ల నిబద్ధత కలిగిన సంపాదకులు. ఆయన ఎంతో మందికి గురు తుల్యులు, మార్గ నిర్దేశకులు. మరెంతో మందిని పాత్రికేయులుగా తీర్చి దిద్దిన గురువులు. పాత్రికేయునిగానే కాక, రచయితగా కూడా ప్రఖ్యాతి గాంచారు. పత్రికారంగంలో అంతటి సంగీత సాహిత్య కళా మర్మాలెరిగిన వ్యక్తి చాలా అరుదు.

నందూరి రామమోహనరావు (ఏప్రిల్ 24, 1927– సెప్టెంబర్ 3, 2011) తెలుగు పాత్రికేయరంగ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన మేధావి. చాలాకాలం ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదక బాధ్యతలు నిర్వహించారు. “బాల” అనే పత్రికలో, ఆంధ్రపత్రిక లోనూ 1940 వ దశకంలో అయన రచనలు ఎన్నో ప్రచురింప బడ్డాయి. “నరావతారం”, “విశ్వరూపం” ఆయన ప్రముఖ రచనలు. సామాన్య జనాలకు సైన్సు విషయాలను పరిచయం చేయడంలో నందూరి కృషి మరవ లేనిది. అయన ఆంధ్రపత్రికలో మార్క్ ట్వేయిన్ నవలలకు తెలుగు అనువాదాలు కూడా చేసారు. దశాబ్దాల క్రితం నందూరి ఆంధ్రవార పత్రికలో పిల్లల కోసం రాబర్ట్ లూయి స్టీవెన్సన్ కాంచన ద్వీపం, మార్క్ ట్వేన్ టామ్ సాయర్, హకల్ బెరీ ఫిన్, రాజూ పేద, విచిత్ర వ్యక్తి అనువాద రచనలు ఆకట్టుకునేవి. అనువాదం కూడా మరో భాష నుంచి అనువాదాన్ని చేసినట్లు కాకుండా తెలుగులో అచ్చు స్వీయ రచనలానే వుండేది.

ఆంధ్రపత్రిక ద్వారా ఆయన జర్నలిస్టు జీవితం ప్రారంభించి, 1948 నుంచి 1960 వరకు ఆయన ఆంధ్ర పత్రికలో పనిచేశారు. 1960లో సహ సంపాదకులుగా ‘ఆంధ్రజ్యోతి’లో కాలూనారు. 1960 నుంచి 1994 దాకా...దాదాపు మూడున్నర దశాబ్దాలు ఆయన ‘ఆంధ్రజ్యోతి’లో రచనా జైత్ర యాత్ర కొనసాగించారు. ఆయన సంపాదకీయ రచనా వైశిష్ట్యం పాఠకులపై చాలా ప్రభావం చూపేది. తొలినాళ్లలో సంపాదకులు నార్ల వెంకటేశ్వర రావుతో కలసి పని చేశారు. నార్ల తర్వాత 1980 లో నందూరి ‘ఆంధ్రజ్యోతి’ సంపాదకులుగా పూర్తిస్థాయి బాధ్యతలు భుజ స్కంధాలపై వేసు కున్నారు. ఆయన 1962, 1978, 1984, 1992 లలో అమెరికాలో, 1982లో రష్యా లోను పర్యటించారు. ఆరు దశాబ్దాల కాలం గడిచినా, నందూరి నాటి పుస్తకాలకు ఆదరణ తగ్గక పోవడం విశేషం. నందూరి ఖగోళ, భౌతిక శాస్త్రాలను పరిశోధించి ‘విశ్వరూపం’ అనే పుస్తకం రచించారు. మానవాళి పరిణామ క్రమానికి సంబంధించిన నరావతారం, తత్త్వశాస్త్రాన్ని సులువుగా వివరించే ‘విశ్వ దర్శనం’ ఆయన కలం నుంచి జాలువారినవే. నందూరి.. సవ్యసాచి పేరుతో రాజకీయ వ్యంగ్య రచనలు, హరివిల్లు పేరుతో బాల గేయాలు, ఉషస్విని పేరిట కవితలు రచించారు. మిత్రలాభం, మిత్ర భేదం (పంచతంత్ర కథలు) పేరిట బాపు వేసిన బొమ్మలకు నందూరి మాటలను అందించారు. ఇంద్రగంటి శ్రీకాంత శర్మతో కలిసి ‘మహా సంకల్పం’ అనే సంకలనాన్ని వెలువరించారు. సంపాదకీయాల సంకలనం అను పల్లవి, చిరంజీవులు, వ్యాఖ్యావళి తదితరాలు ఆయన కలం నుండి జాలువారిన రచనలే. నందూరి రాసిన ఐదు పుస్తకాలను న్యూస్టూడెంట్ బుక్ సెంటర్ అధినేత బాబ్జీ ప్రచురించి 2006 మే 9వ తేదీన ప్రముఖుల సమక్షంల ఆవిష్కరించి, ఆయనను సత్కరించారు.

ఆంధ్రపత్రికలో పని చేసే రోజుల్లో కొడవటిగంటి కుటుంబరావు, పండితారాధ్యుల నాగేశ్వరరావు, తెన్నేటి సూరి, పిలకా గణపతిశాస్త్రి వంటి దిగ్గజాలతో సాహిత్యంపై చర్చించేవారు. అలాగే ఆరుద్ర, శ్రీశ్రీ లతోపాటు ‘ఆంధ్రజ్యోతి’ పూర్వ సంపాదకుడు రామచంద్రమూర్తి, తదితరులతో నందూరికి సంబంధం, అనుబంధం ఉండేది. నరావతారం, విశ్వరూపం, విశ్వదర్శనం – భారతీయ చింతన విశ్వదర్శనం – పాశ్చాత్య చింతన అనుపల్లవి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం) చిరంజీవులు (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం), వ్యాసావళి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం) అక్షరయాత్ర (సాహిత్య, సాహిత్యేతర వ్యాస సప్తతి), ఉషస్విని (కవితా సంపుటి) చిలక చెప్పిన రహస్యం (పిల్లల నవల), మయూర కన్య (పిల్లల నవల), హరివిల్లు (పిల్లల గేయాలు) వంటి రచనలు చేసారు. అభినందన (హైదరాబాదు) సంస్థ నుంచి ముట్నూరి కృష్ణారావు అవార్డు (1988), జూలూరి నాగ రాజారావు (హైదరాబాదు) స్మారక అవార్డు (1989), మద్రాసు తెలుగు అకాడెమీ “ఉగాది వెలుగు” అవార్డు (1989), కళాసాగర్ (మద్రాసు) అవార్డు, అభిరుచి (ఒంగోలు) సంస్థ వారి “పాత్రికేయ రత్న” అవార్డు, . “జమీన్ రైతు” వజ్రోత్సవంలో నెల్లూరి వెంకట్రామా నాయుడు స్మారక అవార్డు (1990), ఆలూరి నారాయణరావు స్మారక ట్రస్టు (విజయవాడ) వారి సి.వై.చింతామణి అవార్డు, తెలుగు యూనివర్సిటీ వారి ఆనరరీ డాక్టరేట్ (1991), అమెరికన్ తెలుగు అసోసియేషన్ వారి “శిరోమణి” అవార్డు (1992), క్రాంతి విద్యా సంస్థల (విజయ వాడ) నుంచి ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1994), రామకృష్ణ జైదయాళ్ హార్మొనీ అవార్డు (1994), సిద్ధార్థ కళా పీఠం (విజయవాడ) వారి విశిష్ట వ్యక్తి అవార్డు (1994), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ జర్నలిస్టు అవార్డు (1996), తెలుగు యూనివర్సిటీ వారి తాపీ ధర్మారావు స్మారక అవార్డు (1997), అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి ప్రతిభామూర్తి అవార్డు (1998), తదితర అవార్డులు అందుకున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# మూసీ తీరాన తొలి ఉద్యోగ పోరాటం

### ఉనికి కోసం విద్యార్థి సమరం: 1952 నాటి చారిత్రక రక్తతర్పణం

### ముల్కీ నినాదం - అమరుల ప్రయాణం: తెలంగాణ హక్కుల పోరాటానికి తొలి సంతకం




తెలంగాణ ఆధునిక ప్రజా పోరాటాల చరిత్రలో 1952 సెప్టెంబర్ 3వ తేదీ ఒక నెత్తుటి మైలురాయిగా, కన్నతల్లి వంటి మాతృభూమి హక్కుల పరిరక్షణకు నవతరం సాగించిన తొలి పెను నిప్పురవ్వగా సువర్ణాక్షరాలతో లిఖించ బడింది. కాకతీయుల శౌర్య పరాక్రమాలు, పోతన భక్తిరస మాధుర్యం, ప్రజాకవుల విప్లవ వీచికలు పురివిప్పిన ఈ పుణ్యభూమిపై స్వాతంత్ర్యపు తొలి పొద్దుల్లోనే స్థానిక యువత తమ ఉనికి, ఆత్మగౌరవం, ఉపాధి హక్కుల కోసం నెత్తురోడుతూ వీధుల్లోకి రావాల్సి రావడం ఒక తీరని చారిత్రక విషాదం. ‘ముల్క్’ అనే ఉర్దూ పదానికి ప్రాంతం లేదా స్వదేశం అనే అర్థం ఉండగా, తరతరాలుగా ఈ మట్టి వాసనను గుండెల్లో నింపుకొని జీవనం సాగిస్తున్న స్థానిక బిడ్డలను గౌరవప్రదంగా ‘ముల్కీలు’గా వ్యవహరించారు. నిజాం నవాబుల పరిపాలనా కాలంలోనే, ప్రధానంగా 1919లో ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ జారీ చేసిన చారిత్రక ఫర్మానా ద్వారా ‘హైదరాబాద్ సివిల్ సర్వీస్ రెగ్యులేషన్స్’ కింద ముల్కీ నిబంధనలు రూపుదిద్దుకున్నాయి. పుట్టుకతో సంస్థానంలో స్థిరపడినవారు లేదా కనీసం పదిహేనేళ్లపాటు వరుసగా ఇక్కడే నివసించినవారికే స్థానిక కొలువుల్లో పట్టం కట్టాలన్నది ఆ రాజశాసనం యొక్క మూల సిద్ధాంతం. అయితే, 1948 సెప్టెంబరులో ఆపరేషన్ పోలో పేరిట సాగిన సైనిక చర్య ద్వారా హైదరాబాద్ రాజ్యం భారత యూనియన్‌లో విలీనమై, 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన అనంతరం ఈ చట్టబద్ధ రక్షణలకు నిర్దాక్షిణ్యంగా పాతర వేసే ప్రక్రియ పరిపాలనా వర్గాల్లో అంతర్గతంగా వేగవంతమైంది. పరిపాలనా సంస్కరణల పేరిట, స్థానిక భాషా నెపంతో ఇతర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో స్థానికేతరులను ప్రభుత్వ సర్వీసుల్లోకి దొడ్డిదారిన నియమించడం స్థానిక విద్యావంతుల గుండెల్లో అంతులేని అసంతృప్తిని, భవిష్యత్ అభద్రతాభావాన్ని, కణకణ మండే అగ్నిపర్వతాలను రగిల్చింది. తమ నేలమీద తమకే గుర్తింపు కరువవుతున్న వేళ, కడుపుమండిన యువతరం అంతరంగంలో రగిలిన ఆత్మఘోష ఒక మహోద్యమానికి నాంది పలికింది.

ఈ అంతర్గత ఆవేదనకు 1952 జూన్–జూలై మాసాల్లో చారిత్రక వరంగల్ పట్టణంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల ఉదంతం తీవ్ర ఉత్ప్రేరకంగా మారి ఉద్యమ దావానలాన్ని రగిలించింది. స్థానిక ఉపాధ్యాయులను నిర్దాక్షిణ్యంగా పక్కనపెట్టి, దాదాపు 180 మందికి పైగా స్థానికేతరులను డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ద్వారా అక్రమంగా నియమించడంతో వరంగల్ వేదికగా విద్యార్థుల గళం కారుమబ్బులా గర్జించింది. ‘నాన్–ముల్కీ గో బ్యాక్’, ‘ఇడ్లీ–సాంబార్ వాపస్ జావో’ అనే నినాదాలు ప్రళయఘోషలా మిన్నంటి, వరంగల్, హన్మకొండలలో పెల్లుబికిన ఆగ్రహ జ్వాలలు క్రమంగా ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, మెదక్ జిల్లాల మీదుగా రాజధాని హైదరాబాద్ నగరానికి శరవేగంగా విస్తరించాయి. ఆగస్టు 29న హన్మకొండ హైస్కూల్ వద్ద శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసు లాఠీచార్జి వార్త హైదరాబాద్ చేరడంతో ఉద్యమం పారే సెలయేరులా ఉరకలెత్తి విస్తరించింది. విద్యార్థి లోకం సమరశంఖం పూరిస్తూ ఆగస్టు 30న సంపూర్ణ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చింది. సైఫాబాద్ సైన్స్ కళాశాల, చాదర్‌ఘాట్, నిజాం కాలేజీ, సిటీ కాలేజీ వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఉద్యమ రణక్షేత్రాలుగా మారాయి. సెప్టెంబర్ 1న హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శివకుమార్‌లాల్ విద్యార్థులను అణచివేయడానికి బహిరంగ హెచ్చరికలు జారీ చేసినా, ఉప్పొంగిన ఆత్మగౌరవ సంకల్పం ముందు అవి ఏమాత్రం నిలువలేకపోయాయి. సెప్టెంబర్ 2 నాటికి భాగ్యనగరం మొత్తం నిరసన ప్రదర్శనలు, ర్యాలీలతో కల్లోల సముద్రంలా దద్దరిల్లగా, ఆందోళనలను కట్టడి చేసే దురుద్దేశంతో సెప్టెంబర్ 3న పోలీస్ కమిషనర్ హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ లోని 22వ సెక్షన్ కింద సభలు, సమావేశాలు, ఊరేగింపులపై తీవ్రమైన నిషేధాజ్ఞలు అమలు చేశారు.

సెప్టెంబర్ 3 ఉదయాన నయాపూల్ సమీపంలోని సిటీ కాలేజీ విద్యార్థి సముద్రమై పొంగిపొర్లింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌లాల్ నిషేధాజ్ఞల గురించి మైకుల్లో విన్నవించినప్పటికీ, తమ న్యాయమైన ఉద్యోగ హక్కులను తాకట్టు పెట్టేది లేదని భీష్మించిన వేలాది మంది యువకిశోరాలు తరగతి గదులను దాటి రాజవీధుల్లోకి కదం తొక్కారు. స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు కొందరు రంగప్రవేశం చేసి సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించినప్పటికీ, పోలీసుల మొండి వైఖరి, దుందుడుకు చర్యలు వాతావరణాన్ని మరింత ఉద్రిక్తం చేశాయి. విద్యార్థులపై విచక్షణారహితంగా బాష్పవాయు గోళాలను ప్రయోగించి, లాఠీల విన్యాసం చేయడంతో ఆ ప్రాంతం యుద్ధభూమిగా మారింది. ఆత్మరక్షణ కోసం విద్యార్థులు, వారికి మద్దతుగా తరలివచ్చిన సాధారణ పౌరులు రాళ్లు రువ్వడంతో పోలీసులు ఏకపక్షంగా తుపాకులకు పనిచెప్పారు. కన్నతల్లి మూసీ నది సాక్షిగా సిటీ కాలేజీ ప్రధాన ద్వారాల వద్ద, పత్తర్‌ఘాట్, మదీనా కూడళ్ల వీధుల్లో తూటాలు పేలడంతో పసిప్రాయపు నెత్తురు ఏరులై పారింది. మహమ్మద్ ఖాసిం, షేక్ మహబూబ్ అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే పోలీసు తూటాలకు బలవుతూ నేలకొరిగి అమరవీరులవగా, తీవ్రంగా గాయపడిన జమాలుద్దీన్, రాములు ఉస్మానియా ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతూ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ దారుణ కాల్పుల పర్వంలో విద్యార్థులు, పోలీసులు, అమాయక బాటసారులతో కలిపి దాదాపు 147 మంది తీవ్ర క్షతగాత్రులయ్యారు. మరుసటి రోజు సెప్టెంబర్ 4న కూడా పోలీసు కాల్పుల్లో మరణించిన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేశారనే తీవ్ర ఆగ్రహంతో అఫ్జల్‌గంజ్, ఉస్మానియా ఆసుపత్రి పరిసరాల్లో ప్రజలు కట్టలు తెంచుకున్న ప్రవాహంలా తిరగబడ్డారు. ఆ క్రమంలో చోటుచేసుకున్న ఘర్షణల్లో పోలీసులు మరోమారు కాల్పులు జరపడంతో గంగాపురం శంకర్, లక్ష్మీనారాయణ, నరసింహులు, మీర్జా అలీ మహమ్మద్ షఫీ వంటి అమాయకులు ప్రాణాలు కోల్పోయి నేలకొరిగారు.

ఈ నెత్తుటి ఘటనల తీవ్రతకు, ప్రజా తిరుగుబాటుకు అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు నేతృత్వంలోని ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ప్రజాగ్రహాన్ని చల్లార్చేందుకు సెప్టెంబర్ 5న హైదరాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పింగళి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏకసభ్య విచారణ కమిషన్‌ను నియమించింది. దాదాపు వంద మంది సాక్షులను, అధికారులను విచారించిన పింగళి జగన్మోహన్‌రెడ్డి కమిషన్, డిసెంబర్ 28న ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పోలీసు ఉన్నతాధికారుల అనాలోచిత తీరును, సమన్వయ లోపాన్ని, నిరాయుధులైన విద్యార్థులపై మితిమీరిన బలప్రయోగాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. అదే సమయంలో ముల్కీ నిబంధనల పరిశీలనకు, ఉద్యోగ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 7న నలుగురు మంత్రులతో కూడిన అత్యున్నత మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. ఈ కేబినెట్ ఉపసంఘంలో అప్పటి ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి డాక్టర్ బూర్గుల గోపాలరావు (జి.ఎస్. మెల్కోటే), విద్యాశాఖ మంత్రి ఫూల్‌చంద్ గాంధీ, వ్యవసాయ శాఖ మంత్రి నవాబ్ మెహదీ నవాజ్ జంగ్, పునరావాస మరియు స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి కొండా వెంకట రంగారెడ్డి (కె.వి. రంగారెడ్డి) సభ్యులుగా వ్యవహరించి స్థానిక ఉద్యోగ రక్షణలపై విస్తృత పరిశీలన జరిపారు.

1952 నాటి ఈ సిటీ కాలేజీ నెత్తుటి అధ్యాయం కేవలం ఒక తాత్కాలిక విద్యార్థి నిరసన మాత్రమే కాదు; అది ప్రాంతీయ వనరులు, అవకాశాలు, ఉద్యోగాలపై స్థానికులకే సంపూర్ణ సార్వభౌమాధికారం ఉండాలనే చైతన్యానికి నూతన భావజాలాన్ని అందించిన తొలి రాజకీయ గర్జన. 1969 నాటి చారిత్రక తొలిదశ జై తెలంగాణ ఉద్యమానికి, తదనంతర కాలంలో దశాబ్దాల పాటు సాగి చివరకు స్వరాష్ట్ర కల సాకారమైన మలిదశ ప్రత్యేక రాష్ట్ర సాధనా ప్రస్థానానికి దిక్సూచిగా నిలిచిన ‘తెలంగాణ స్థానిక అస్తిత్వ ఆత్మఘోష’ ఈ రక్తతర్పణంలోనే మొలకెత్తింది. ఆనాడు సిటీ కాలేజీ ముంగిట నేలరాలిన అమరుల త్యాగాలు, ఆ ప్రాంగణంలో చిందిన ప్రతి రక్తపు బొట్టు పారే సెలయేటి స్వచ్ఛతతో, మ్రోగే పాంచజన్యపు నాదంతో తెలంగాణ సమాజంలో ఆత్మగౌరవ జ్యోతిగా మారి, భావితరాల హక్కుల పోరాటాలకు ఎప్పటికీ చెరిగిపోని నిత్య స్ఫూర్తిగా, సజీవ ప్రతీకగా నిలిచింది. ఈ పోరాట చైతన్యం కేవలం గత కాలపు జ్ఞాపకం కాదు; స్వపరిపాలన, ఆత్మగౌరవం, స్వావలంబనల ప్రాధాన్యతను నిత్యం గుర్తుచేసే ఒక నిరంతర ఆత్మప్రబోధం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# ఆటగాళ్ల ఎంపికలో బీసీసీఐ కొత్త పాలసీ!

- ఆటగాళ్ల ఫిట్‌నెస్ విషయంలో కఠిన వైఖరి
- 200 శాతం ఫిట్‌గా ఉంటేనే జట్టులోకి ఎంపిక చేయాలని నిర్ణయం
- గాయాల నిర్వహణపై విమర్శల నేపథ్యంలో కొత్త పాలసీ
- ఆఫ్ఘన్ సిరీస్‌కు నలుగురు ఆటగాళ్లు ఫిట్‌నెస్‌కు లోబడి ఎంపిక
- పూర్తి పారదర్శకత కోసమే ఈ విధానమన్న వీవీఎస్ లక్ష్మణ్



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆటగాళ్ల ఎంపిక విషయంలో, ముఖ్యంగా వారి ఫిట్‌నెస్‌కు సంబంధించి అత్యంత కఠినమైన వైఖరిని అవలంబించడం ప్రారంభించింది. గాయపడిన ఆటగాళ్ల నిర్వహణపై ఇటీవలి కాలంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న నేపథ్యంలో భవిష్యత్తులో అలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టింది. ఇకపై ఒక ఆటగాడిని జట్టులోకి ఎంపిక చేయాలంటే, అతని ఫిట్‌నెస్‌పై 100 శాతం కాదు, ఏకంగా 200 శాతం నమ్మకం ఉంటేనే తుది నిర్ణయం తీసుకోవాలని పాలసీని మార్చింది. ఇటీవల అఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో ఈ కొత్త విధానం స్పష్టంగా కనిపించింది. ఈ జట్టులో జస్ప్రీత్ బుమ్రా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా వంటి ఆటగాళ్ల పేర్ల పక్కన ఒక ఆస్టరిస్క్ (*) గుర్తును చేర్చారు. దీని అర్థం, వారి ఎంపిక వారి ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ స్పష్టం చేసింది. గత కొద్ది నెలలుగా గాయాలతో సతమతమవుతున్న ఆటగాళ్లను పూర్తి ఫిట్‌నెస్ సాధించకుండానే జాతీయ జట్టులోకి ఎంపిక చేయడం, వారు ఒకటి రెండు మ్యాచ్‌లు ఆడి మళ్లీ గాయపడటంతో బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) పనితీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే బోర్డు ఈ కొత్త నిర్ణయం తీసుకుంది.

క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. "ఒక ఆటగాడి లభ్యతపై 100 శాతం కాదు, 200 శాతం విశ్వాసం వచ్చాకే అతడిని విడుదల చేయాలని యాజమాన్యం భావిస్తోంది" అని ఈ విధానం గురించి తెలిసిన ఒక అధికారి పేర్కొన్నారు. ఈ కొత్త విధానంపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ స్పందిస్తూ.. ఎంపిక వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత తీసుకురావడమే తమ లక్ష్యమని వివరించాడు. "జాతీయ సిరీస్‌లలో పాల్గొనడానికి తాము ఇంకా సిద్ధంగా లేమని ఆటగాళ్లు అర్థం చేసుకుంటారు. ఈ కమ్యూనికేషన్ ఆటగాళ్లకు, జట్టుకు మధ్య సజావుగా సాగుతోంది. ఫిట్‌నెస్ రిపోర్టులు, ఎంపిక ప్రక్రియలో బీసీసీఐ పారదర్శకతను పాటిస్తోంది. ఒకవేళ ఆటగాళ్లు ఫిట్‌నెస్ టెస్టులో విఫలమైతే, వారి స్థానంలో ఎవరిని తీసుకోవాలనే దానిపై సెలక్టర్లకు స్పష్టత ఉంటుంది. ఇది చాలా ప్రాథమికమైన విషయం" అని లక్ష్మణ్ తెలిపాడు. ఆటగాళ్ల పేర్ల పక్కన ఆస్టరిస్క్ గుర్తు ఎందుకు చేర్చారో బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా కూడా వివరించారు. సాధారణంగా అంతర్జాతీయ సిరీస్‌లకు 34 వారాల ముందే జట్లను ఎంపిక చేస్తామని, ఎంపిక తేదీ నాటికి ఒక ఆటగాడు ఫిట్‌గా లేకపోయినా, సిరీస్ ప్రారంభమయ్యే నాటికి కోలుకునే అవకాశం ఉంటుందని అన్నారు. "ఆ సమయంలో అతను పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే, జట్టులోకి తీసుకుంటాం. అందుకే వారిని పూర్తిగా తిరస్కరించకుండా, ఫిట్‌నెస్‌కు లోబడి ఎంపిక చేస్తున్నాం" అని సైకియా పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్థాన్ సిరీస్ విషయానికొస్తే, బుమ్రా, నితీశ్ కుమార్ రెడ్డి సెప్టెంబర్ 13న ఢిల్లీలో జరిగే తొలి మ్యాచ్ నాటికి పూర్తి ఫిట్‌నెస్‌తో అందుబాటులోకి వస్తారని అంచనా. అయితే, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్‌ల విషయంలో ఇంకా స్పష్టత రాలేదని, సీఓఈ ఎలాంటి రిస్క్ తీసుకునేందుకు సిద్ధంగా లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ కొత్త పాలసీతో ఆటగాళ్ల దీర్ఘకాలిక కెరీర్‌కు మేలు చేయడంతో పాటు జట్టు స్థిరత్వాన్ని కాపాడాలని బీసీసీఐ భావిస్తోంది.




## ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం..

- మహిళల క్రికెట్‌లో కొత్త చరిత్ర..

మహిళల క్రికెట్ అభిమానులకు ఐసీసీ శుభ వార్త అందించింది. 2027లో తొలిసారిగా నిర్వహించనున్న ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధికారికంగా ప్రకటించింది. టోర్నమెంట్ 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు జరగనుంది.

**ముంబై, వడోదరలో మ్యాచ్‌లు**

మహిళల ఛాంపియన్స్ ట్రోఫీలోని అన్ని మ్యాచ్‌లు భారత్‌లోని రెండు చారిత్రాత్మక క్రికెట్ వేదికల్లో నిర్వహించనున్నారు. ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (బ్రాబోర్న్ స్టేడియం), వడోదర అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

శ్రీలంక నుంచి భారత్‌కు ఎందుకు మార్చారు? తొలుత ఈ టోర్నమెంట్‌ను శ్రీలంకలో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే శ్రీలంక క్రికెట్ బోర్డు (SLC)లో కొనసాగుతున్న పరిపాలనా సంస్కరణల నేపథ్యంలో ఆతిథ్య వేదికను మార్చాలని ఐసీసీ నిర్ణయించింది. ఆతిథ్యం కోసం భారత్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా సమర్పించిన బిడ్లను పరిశీలించిన ఐసీసీ.. భారత్ బిడ్‌కు ఆమోదం తెలిపింది. సెప్టెంబర్ 2న ఐసీసీ బోర్డు భారత్ ఆతిథ్యాన్ని ధృవీకరించింది.

**ఆరు అగ్రశ్రేణి జట్లతో పోటీ**

తొలి మహిళల ఛాంపియన్స్ ట్రోఫీలో మొత్తం ఆరు ప్రపంచ స్థాయి జట్లు పాల్గొంటాయి. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లు టోర్నమెంట్‌లో బరిలోకి దిగనున్నాయి. జూలై 6 నాటి ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా ఈ ఆరు జట్లను ఎంపిక చేశారు. అన్ని జట్లు రౌండ్‌రాబిన్ విధానంలో మిగిలిన జట్లతో తలపడతాయి. లీగ్ దశ ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు ఫిబ్రవరి 28న జరిగే ఫైనల్‌లో తలపడతాయి.

**మహిళల క్రికెట్‌లో కొత్త అధ్యాయం**

ఐసీసీ అధ్యక్షుడు జయ్ షా మాట్లాడుతూ.. 2027 మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ మహిళల క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని అన్నారు. తొలి ఎడిషన్‌లో ప్రపంచంలోని అత్యుత్తమ జట్లు హోరాహోరీగా తలపడనున్నాయని తెలిపారు. అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌ను మెరుగుపరుచుకోవడంతో పాటు ప్రపంచ వేదికపై తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ టోర్నమెంట్ జట్ల మధ్య పోటీని పెంచుతుందని ఐసీసీ పేర్కొంది.

## ముంబై ఇండియన్స్ లోనే హార్దిక్ పాండ్యా..



టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఐపీఎల్ భవిష్యత్తుపై మరో బిగ్ ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శన తర్వాత హార్దిక్‌ను ట్రేడ్ చేస్తారనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. తాజా సమాచారం ప్రకారం హార్దిక్‌ను జట్టులోనే కొనసాగించాలని ముంబై ఇండియన్స్ మేనేజ్‌మెంట్ భావిస్తోందట. అయితే అతడిని కెప్టెన్‌గా కొనసాగించకుండా.. కొత్త నాయకుడిని ఎంపిక చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ట్రేడ్ విషయంలో పలు ఫ్రాంచైజీల పేర్లు వినిపించాయి. ముఖ్యంగా కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ వంటి జట్లు హార్దిక్‌ను జట్టులోకి తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం ఏ ట్రేడ్ కూడా ఫైనల్ కాలేదని సమాచారం. హార్దిక్ ముంబై ఇండియన్స్‌లోనే కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఓ జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. హార్దిక్ విషయంలో ముంబై, కోల్‌కతా మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే ముంబైకి సరైన ఆటగాడిని ట్రేడ్‌లో భాగంగా పొందే పరిస్థితి లేకపోవడంతో.. ఒప్పందం ముందుకు సాగలేదట. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ పేరును కూడా చర్చించినట్లు తెలుస్తోంది. అయితే ఆస్ట్రేలియా టెస్టు షెడ్యూల్, అతడి వర్క్‌లోడ్ వంటి అంశాలపై ముంబై టీమ్ మేనేజ్‌మెంట్‌కు కొన్ని సందేహాలు ఉన్నట్లు సమాచారం. దీంతో హార్దిక్‌ను ట్రేడ్ చేయడం కంటే జట్టులోనే కొనసాగించడం మేలని ఫ్రాంచైజీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. హార్దిక్ ముంబైలోనే కొనసాగినా.. కెప్టెన్సీ నుంచి తప్పుకునే అవకాశం ఉందట. ఐపీఎల్ 2027 కోసం కొత్త నాయకత్వ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ముంబై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2024లో హార్దిక్ మళ్లీ ముంబై జట్టులోకి వచ్చిన తర్వాత రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఆ నిర్ణయంపై అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. హార్దిక్‌ను పలుమార్లు ముంబై అభిమానులు విమర్శలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ తర్వాత జట్టు విజయాల్లో నిలకడ లోపించడం, 2026లో మరోసారి నిరాశాజనక ఫలితం రావడంతో ఇప్పుడు నాయకత్వ మార్పుపై చర్చ జరుగుతోంది. ముంబై కెప్టెన్‌గా హార్దిక్ ఇప్పటివరకు 39 ఐపీఎల్ మ్యాచ్‌లకు నాయకత్వం వహించాడు. ఇందులో 15 విజయాలు, 24 ఓటములు ఉన్నాయి. అతడి విజయ శాతం 38.46గా ఉంది. ముంబై ఇండియన్స్‌కు అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా రోహిత్ శర్మ ఉన్నాడు. రోహిత్ 163 మ్యాచ్‌ల్లో జట్టుకు నాయకత్వం వహించి 91 విజయాలు అందించాడు. అతడి విజయ శాతం ఏకంగా 55.82గా ఉంది. హార్దిక్‌ను ప్లేయర్‌గా కొనసాగిస్తూ కొత్త కెప్టెన్‌ను ఎంచుకోవాలని ముంబై నిర్ణయిస్తే.. ఆ బాధ్యత ఎవరికి అప్పగిస్తారన్నది ఆసక్తికరంగా మారుతుంది. ఫ్రాంచైజీ భవిష్యత్ నాయకత్వ ప్రణాళిక, రిటెన్షన్స్, వేలం వ్యూహం తదితర అంశాలపై ఆధారపడి ఈ నిర్ణయం ఉండనుంది.



## 106 పరుగుల విధ్వంసం..

- కోహ్లీ, వార్నర్ సరసన డి కాక్..
- టీ20ల్లో అరుదైన రికార్డు

కరేబియన్ ప్రీమియర్ లీగ్ (CPL)లో దక్షిణాఫ్రికా స్టార్ బ్యాటర్ క్వింటన్ డి కాక్ మెరుపు శతకంతో టీ20 క్రికెట్‌లో అరుదైన మైలురాయిని అందుకున్నాడు. సెప్టెంబర్ 1న బాసెటెర్రెలో జరిగిన మ్యాచ్‌లో బార్బడోస్ ట్రైడెంట్స్ తరఫున ఆడిన డి కాక్ కేవలం 57 బంతుల్లోనే 11 ఫోర్లు, 6 సిక్సర్లతో 106 పరుగులు చేశాడు. ఈ సెంచరీతో డి కాక్ టీ20 కెరీర్‌లో 10వ శతకాన్ని నమోదు చేశాడు. 457వ టీ20 మ్యాచ్‌లో ఈ ఘనత సాధించిన అతని మొత్తం టీ20 పరుగులు 12,867కు చేరాయి. దీంతో టీ20ల్లో 10 సెంచరీలు చేసిన విరాట్ కోహ్లీ, డేవిడ్ వార్నర్‌ల సరసన డి కాక్ నిలిచాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక సెంచరీల రికార్డు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉంది. గేల్ 22 శతకాలు సాధించగా, పాకిస్థాన్ స్టార్ బాబర్ ఆజం 13 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు. డి కాక్, విరాట్ కోహ్లీ, డేవిడ్ వార్నర్ చెరో 10 శతకాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అయితే డి కాక్ అద్భుత ఇన్నింగ్స్ బార్బడోస్ విజయానికి మాత్రం సరిపోలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన బార్బడోస్ ట్రైడెంట్స్ డి కాక్ 106 పరుగుల సహకారంతో 20 ఓవర్లలో 217 పరుగులు చేసింది.

భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ పేట్రియాట్స్ దూకుడుగా ఆడింది. ఓపెనర్ జాన్సన్ చార్లెస్ కేవలం 45 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 78 పరుగులు చేశాడు. జాసన్ హోల్డర్ 11 బంతుల్లో రెండు సిక్సర్లతో 18 పరుగులు చేసి అతడికి అండగా నిలిచాడు. చివరికి సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ పేట్రియాట్స్ 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. దీంతో బార్బడోస్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వ్యక్తిగతంగా డి కాక్ చరిత్ర సృష్టించినప్పటికీ, అతని శతకం జట్టుకు విజయాన్ని అందించలేకపోయింది.

## నేడు హాంకాంగ్‌తో భారత్ పోరు

- మహిళల ఆసియా కప్ టి20 టోర్నీ
- రాత్రి 8 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్ చానెల్, సోనీ లివ్ యాప్‌లో ప్రసారం



ఆసియా కప్ టి20 టోర్నీ తొలి మ్యాచ్‌లో స్థాయికి తగ్గ ఆటతీరు కనబర్చలేకపోయిన భారత మహిళల బృందం తమ తర్వాతి పోరుకు సిద్ధమైంది. నేడు జరిగే గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో మరో బలహీన జట్టు హాంకాంగ్‌తో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత జట్టుకు సెమీఫైనల్ బెర్త్ ఖరారవుతుంది. గత మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌పై విజయం సాధించినా... షఫాలీ వర్మ మినహా ఇతర ప్రధాన బ్యాటర్లంతా విఫలమయ్యారు. టి20ల్లో అరంగేట్రం చేసిన ప్రతీక రావల్‌తో పాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్, ఓపెనర్ స్మృతి, భారతి ఫుల్మాలి, రిచా ఘోష్, దీప్తి శర్మ ఏమాత్రం ప్రభావం చూపలేకపోవడంతో 29 పరుగుల వ్యవధిలోనే జట్టు 7 వికెట్లు కోల్పోయి 159 పరుగులకే పరిమితమైంది. బౌలింగ్‌లో రాణించడంతో తుది ఫలితం భారత్‌కు అనుకూలంగా వచ్చినా... తమ మిడిలార్డర్‌ను చక్కదిద్దుకునేందుకు భారత్‌కు ఇది సరైన అవకాశం. షఫాలీ మరోసారి చెలరేగితే జట్టుకు మంచి ఆరంభం లభించడం ఖాయం. స్మృతి అంచనాలకు అనుగుణంగా చెలరేగాల్సి ఉండగా, జెమీమా గాయంతో ఈ టోర్నీకి అవకాశం దక్కించుకున్న ప్రతీక భవిష్యత్తుకు ఇక్కడి ప్రదర్శన కీలకం కానుంది. ఇటీవలి టి20 వరల్డ్ కప్ వైఫల్యం తర్వాత ఈ ఫార్మాట్‌లో తన కెరీర్ ముగింపు దశలో ఉన్న హర్మన్ కూడా బ్యాటింగ్‌లో మెరుగవ్వాల్సి ఉంది. బౌలింగ్‌లో మాత్రం జట్టు పటిష్ఠంగా ఉండటం సానుకూలాంశం. గత మ్యాచ్‌లో పేసర్లు క్రాంతి, నందని శర్మలతో పాటు ముగ్గురు స్పిన్నర్లు శ్రీచరణి, ప్రేమ రావత్, దీప్తిలను ఆడించిన మన జట్టు ఈసారి వ్యూహం మారుస్తుందా అనేది చూడాలి. మరోవైపు భారత్‌తో పోలిస్తే ప్రత్యర్థి హాంకాంగ్ అన్ని రకాలుగా బలహీనమైన జట్టు. తమ తొలి మ్యాచ్‌లో ఆ జట్టు ఆరు పరుగుల తేడాతో థాయ్‌లాండ్ చేతిలో ఓడింది. ఆల్‌రౌండర్ కేరీ చాన్, యాస్మిన్, కెప్టెన్ మర్యమ్, పేసర్ అలీసాన్ జట్టులో కీలక సభ్యులుగా తమ వంతు పాత్ర పోషించగలరు.

## భారత్ ఫుట్‌బాల్ చరిత్రలో కీలక మలుపు

- అక్టోబర్ 3న బ్రెజిల్‌తో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనున్న భారత్
- 2027 ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించడమే లక్ష్యమన్న కోచ్ జమీల్

న్యూఢిల్లీ: ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ బ్రెజిల్‌తో సొంతగడ్డపై ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడనుండటం... భారత ఫుట్‌బాల్ చరిత్రలో కీలక మలుపు కానుందని హెడ్ కోచ్ ఖాలిద్ జమీల్ అన్నాడు. వచ్చే ఏడాది జరగనున్న ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు అంతకుముందు స్వదేశంలో పనామా, బ్రెజిల్, ఉరుగ్వే జట్లతో అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడనుంది. సాకర్ చరిత్రలో అత్యుత్తమ జట్లలో ఒకటిగా పేరున్న బ్రెజిల్ జట్టు ఇప్పటివరకు ఐదుసార్లు 'ఫిఫా' ప్రపంచకప్ విజేతగా నిలవగా... ఉరుగ్వే రెండుసార్లు టైటిల్ కైవసం చేసుకుంది. అలాంటి మేటి జట్లతో తలపడితే... మన ప్లేయర్లు ఎంతో మెరుగయ్యే అవకాశం ఉందని జమీల్ పేర్కొన్నాడు. 'అవును. ఇది భారత ఫుట్‌బాల్ చరిత్రలో అత్యంత కీలక మైలురాయి. బ్రెజిల్‌తో ఇప్పటి వరకు భారత జట్టు తలపడలేదు. వారితో ఆడనుండటం ఇదే మొదటిసారి. సానుకూలంగా ముందుకు సాగుతూ మెరుగైన ప్రదర్శన చేయడమే లక్ష్యంగా బరిలోకి దిగుతాం. 2027 ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. దానికి ముందు బలమైన జట్లతో ఆడనుండటం మాకు ఉపయోగపడుతుంది' అని జమీల్ వెల్లడించాడు. ఈ నెల 26న బెంగళూరు వేదికగా పనామాతో భారత్ తలపడనుంది. అనంతరం అక్టోబర్ 3న కోల్‌కతా వేదికగా బ్రెజిల్‌తో... అక్టోబర్ 6న ఉరుగ్వేతో టీమిండియా తలపడనుంది. ఇలాంటి కీలక సమయంలో విమర్శలను పక్కనపెట్టి అభిమానులంతా జట్టుకు అండగా నిలవాల్సిన అవసరముందని జమీల్ అన్నాడు. 'భారత ఫుట్‌బాల్ చరిత్రలోనే ఇది కీలక మలుపు. ఈ సమయంలో ప్రతికూల విమర్శలను పక్కనపెట్టి... జట్టుకు మద్దతుగా నిలవాలి. ఈ మ్యాచ్‌లకు భారీ ఎత్తున అభిమానులు తరలిరావడం ఖాయం. సొంతగడ్డపై వారి ప్రోత్సాహం ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది. అగ్రశ్రేణి జట్లతో ఆడుతున్నప్పుడు డిఫెన్స్, అటాకింగ్ రెండింటిలోనూ బలంగా ఉండాలి. ముఖ్యంగా ప్లేయర్లు ఫిట్‌నెస్ మరింత మెరుగు పరుచుకోవాలి. పూర్తి ఆత్మవిశ్వాసంతో మైదానంలో అడుగుపెట్టడం చాలా ముఖ్యం. పెద్ద జట్లతో తలపడినప్పుడే ఆటగాళ్ల నైపుణ్యం, జట్టు వ్యూహాలు మెరుగవుతాయి' అని జమీల్ వివరించాడు. భారత ఫుట్‌బాల్ సమాఖ్య కృషితోనే బ్రెజిల్, ఉరుగ్వే, పనామా వంటి మెరుగైన ర్యాంక్‌ల్లో ఉన్న జట్లతో పోటీపడే అవకాశం దక్కిందని కోచ్ వెల్లడించాడు.

**గంటలోనే టికెట్లు ఖతం**

భారత్, బ్రెజిల్ అంతర్జాతీయ ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్ టికెట్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. అక్టోబర్ 3న కోల్‌కతా వేదికగా ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ బ్రెజిల్‌తో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన ప్రాథమిక ధర టికెట్లన్నీ బుధవారం గంటలోనే అమ్ముడవడం విశేషం. ఫుట్‌బాల్ చరిత్రలో భారత జట్టు ఇప్పటి వరకు బ్రెజిల్‌తో మ్యాచ్ ఆడలేదు. దీంతో ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు అభిమానులు ఆతృత కనబరుస్తున్నారు. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ల ధరలను రూ. 999 నుంచి రూ. 15,000గా నిర్ణయించారు. వివేకానంద యువ భారతి మైదాన సామర్థ్యం 67,000 కాగా... టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చారు. ఇందులో రూ.999, రూ.2,000, రూ. 3,500, రూ. 4,500, రూ. 6,000, రూ. 7,000, రూ. 9,000, రూ. 15,000 టికెట్లు అమ్మకానికి ఉన్నాయిరు. అయితే ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులోకి వచ్చిన గంట వ్యవధిలోనే ప్రాథమిక ధర టికెట్లు పూర్తిగా అమ్ముడయ్యాయని నిర్వాహకులు వెల్లడించారు. ఈ నెల 26న బెంగళూరు వేదికగా పనామాతో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడనున్న టీమిండియా... ఆ తర్వాత బ్రెజిల్, ఉరుగ్వే (అక్టోబర్ 6న) స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం భారత హెడ్ కోచ్ ఖాలిద్ జమీల్ ఇప్పటికే 26 మందితో కూడిన జట్టును ప్రకటించాడు. వీరంతా ఈ నెల 14 నుంచి బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ శిబిరంలో పాల్గొననున్నారు. పనామాతో పోరు అనంతరం ఈ నెల 28న భారత జట్టు కోల్‌కతా చేరుకోనుంది.



## ఐదు సెట్‌ల పోరులో సొనెగోపై జ్వెరెవ్‌విజయం



న్యూయార్క్: కాస్త అటు ఇటు అయి ఉంటే... యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో మరో సంచలనం నమోదయ్యేది. ఇప్పటికే సెర్బియా దిగ్గజం, 24 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత జొకోవిచ్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టగా... టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) కూడా జొకోవిచ్ సరసన చేరేవాడు. కానీ ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న జ్వెరెవ్ తన అనుభవాన్నంతా రంగరించి పోరాడి ఓటమి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. 4 గంటల 53 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో జ్వెరెవ్ 6-4, 3-6, 6-7 (7/9), 7-5, 6-4తో ప్రపంచ 89వ ర్యాంకర్ లొరెంజో సొనెగో (ఇటలీ)పై కష్టపడి గెలుపొందాడు.

నాలుగో సెట్ పదో గేమ్‌లో జ్వెరెవ్ ఓటమికి రెండు పాయింట్ల దూరంలో నిలిచాడు. పదో గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకున్న జ్వెరెవ్ ఆ తర్వాత లొరెంజో సర్వీస్‌ను బ్రేక్ చేసి 6-5తో ఆధిక్యంలోకి వెళ్లాడు. పన్నెండో గేమ్‌లో మళ్లీ తన సర్వీస్‌ను కాపాడుకొని జ్వెరెవ్ సెట్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక ఐదో సెట్‌లోని ఐదో గేమ్‌లో సొనెగో సర్వీస్‌ను బ్రేక్ చేసిన జ్వెరెవ్ ఆ తర్వాత తన సర్వీస్‌లను నిలబెట్టుకొని గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో తన 100వ విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. మ్యాచ్ మొత్తంలో 12 ఏస్‌లు కొట్టిన జ్వెరెవ్ 8 డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నెట్ వద్దకు 54 సార్లు దూసుకొచ్చి 38 సార్లు పాయింట్లు గెలిచాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు.

61 విన్నర్స్ కొట్టిన ఈ జర్మనీ స్టార్ 39 అనవసర తప్పిదాలు చేశాడు. ఈ ఏడాది జ్వెరెవ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరుకొని, ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్ సాధించాడు. వింబుల్డన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో ఐదో సీడ్, ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ ఫ్లావియో కొబోలి (ఇటలీ) 4 గంటల 13 నిమిషాల్లో 3-6, 2-6, 6-3, 6-4, 6-4తో ఫ్రాన్సిస్కో కమ్సానా (అర్జెంటీనా)పై శ్రమించి గెలిచాడు. తెలుగు సంతతికి చెందిన అమెరికా ప్లేయర్ నిశేష్ బసవారెడ్డి తొలి రౌండ్‌లో 6-7 (4/7), 6-3, 4-6, 4-6తో ట్రిస్టన్ స్కూల్‌కేట్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయాడు. తొలి రౌండ్‌లో ఓడిన నిశేష్‌కు 1,40,000 డాలర్లు (రూ. 1 కోటీ 32 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

**మెద్వెదెవ్ ముందంజ**

పురుషుల సింగిల్స్‌లో 2021 చాంపియన్, 2019, 2023 రన్నరప్ మెద్వెదెవ్ (రష్యా) మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ మెద్వెదెవ్ 6-1, 6-3, 7-5తో గోర్‌జనీ (అమెరికా)పై గెలుపొందాడు. మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో అలెక్స్ మిచెల్సన్ (అమెరికా) 6-3, 6-4, 6-4తో 16వ సీడ్ బ్రాండన్ నక□□మా (అమెరికా)పై నెగ్గాడు. మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా), 19వ సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ) మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో పెగూలా 6-3, 6-1తో 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ సోఫియా కెనిన్ (అమెరికా)పై, పావోలిని 6-4, 6-1తో తన దేశానికే చెందిన లుక్రెజియా స్టెఫానినిపై గెలుపొందారు.

**బెన్‌చిచ్‌కు షాక్**

మహిళల సింగిల్స్‌లో 12వ సీడ్ బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. బెన్‌చిచ్ 2 గంటల 51 నిమిషాల్లో 6-4, 5-7, 3-6తో యూలియా పుతింత్‌సెవా (కజకిస్తాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. రెండో సీడ్ రిబాకినా (కజకిస్తాన్), నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా), ఐదో సీడ్ మిరా ఆండ్రీవా (రష్యా) అలవోక విజయాలతో రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. తొలి రౌండ్‌లో రిబాకినా 6-3, 6-2తో థియా ఫ్రోడిన్ (అమెరికా)పై, కోకో గాఫ్ 6-3, 6-4తో జెనెప్ సోన్‌మెజ్ (టర్కీ)పై, ఆండ్రీవా 6-2, 6-2తో జెనిస్ జెన్ (ఇండోనేసియా)పై నెగ్గారు.




## శ్రీకృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్..

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు, సినీ ప్రేక్షకులకు మేకర్స్ అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు. సుదీప్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'దేవరాయ' నుంచి కీలకమైన అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో సుదీప్ శ్రీకృష్ణదేవరాయలుగా కనిపించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 'చరిత్రను మార్చిన సామ్రాజ్యం.. ఒక శకాన్ని నిర్వచించిన మహారాజు.. కాలాన్ని దాటి నిలిచిపోయే ఓ దిగ్గజం' అంటూ 'దేవరాయ'ను మేకర్స్ పరిచయం చేశారు. అభినయ చక్రవర్తి కిచ్చా సుదీప్‌ను శ్రీకృష్ణదేవరాయల పాత్రలో చూపించబోతున్నట్లు వెల్లడించారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయలు భారత చరిత్రలో అత్యంత గొప్ప రాజుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. అలాంటి చారిత్రక పాత్రలో సుదీప్ కనిపించనుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. విడుదల చేసిన గ్లింప్స్‌లో సుదీప్ లుక్ రాజసం, గంభీరతతో ఆకట్టుకునేలా ఉంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సుప్రియాన్వి పిక్చర్ స్టూడియో బ్యానర్లపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి గౌర హరి సంగీతం అందిస్తున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 2027 డిసెంబర్‌లో థియేటర్లలోకి రానుందని మేకర్స్ ప్రకటించారు. ఇప్పటి వరకు సుదీప్ మాస్, యాక్షన్ పాత్రలతో ప్రేక్షకులను అలరించగా.. ఇప్పుడు శ్రీకృష్ణదేవరాయల వంటి చారిత్రక పాత్రలో ఆయన ఎలా కనిపించబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం సుదీప్ కెరీర్‌లో ప్రత్యేకమైన సినిమాగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## సొంత గడ్డపైనే యశ్‌కు షాక్..

రాకింగ్ స్టార్ యశ్ నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'టాక్సిక్'. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాలను ఎదుర్కొంటున్నట్లు ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా యశ్‌కు బలమైన మార్కెట్ ఉన్న సొంత రాష్ట్రం కర్ణాటకలో ఈ సినిమా ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సాధారణంగా స్టార్ హీరోల భారీ బడ్జెట్ సినిమాలకు సొంత రాష్ట్రంలో మొదటి రోజు నుంచే భారీ ఓపెనింగ్స్ వస్తుంటాయి. సినిమా టాక్ ఎలా ఉన్నా.. హీరోకు ఉన్న క్రేజ్, అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి వారంలోనే భారీ వసూళ్లు నమోదవుతుంటాయి. అయితే 'టాక్సిక్' విషయంలో మాత్రం ఈ పరిస్థితి భిన్నంగా కనిపించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యశ్ హోమ్ స్టేట్ అయిన కర్ణాటకలో ఈ సినిమా కనీసం రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను కూడా చేరుకోలేకపోయిందనే వార్తలు ట్రేడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. యశ్ క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుంటే ఈ మార్క్‌ను 'టాక్సిక్' సులభంగా అందుకుంటుందని చాలామంది అంచనా వేశారు. కానీ మొదటి రోజు మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. రెండో రోజు నుంచే గణనీయమైన డ్రాప్‌ను చూసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అడ్వాన్స్ బుకింగ్స్ అనుకున్న స్థాయిలో లేకపోవడం సినిమా థియేట్రికల్ రన్‌పై ప్రభావం చూపినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో కర్ణాటకలో రూ.100 కోట్ల గ్రాస్ క్లబ్‌ను అందుకోవాలనే టార్గెట్‌ను 'టాక్సిక్' చేరుకోలేకపోయిందనే టాక్ వినిపిస్తోంది. అయితే ఈ చిత్రానికి హిందీ మార్కెట్‌లో మాత్రం సినిమాకు కొంత ఊరట లభించినట్లు తెలుస్తోంది. కన్నడ వెర్షన్‌తో పోలిస్తే ఉత్తరాది రాష్ట్రాల్లోని హిందీ బెల్ట్‌లో 'టాక్సిక్'కు మెరుగైన స్పందన వచ్చినట్లు ట్రేడ్ వర్గాల అంచనా. అక్కడి నుంచి వస్తున్న వసూళ్లు సినిమాకు కొంత బలాన్నిస్తున్నాయని చెబుతున్నారు. ఇక తెలుగులోనూ 'టాక్సిక్'కు తొలి రోజు సాలిడ్ ఓపెనింగ్ వచ్చినప్పటికీ.. రెండో రోజు నుంచి పరిస్థితి మారిపోయినట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో షోలు క్యాన్సిల్ అయ్యే పరిస్థితి కూడా ఎదురైనట్లు సమాచారం. దీంతో తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయిందని, బయ్యర్లకు నష్టాలు మిగిల్చిందనే టాక్ వినిపిస్తోంది. మొత్తంగా యశ్‌కు ఉన్న భారీ క్రేజ్, సినిమాపై ఉన్న అంచనాలతో పోలిస్తే 'టాక్సిక్' బాక్సాఫీస్ ప్రయాణం ఆశించిన స్థాయిలో సాగలేదనే చర్చ ట్రేడ్ వర్గాల్లో జరుగుతోంది. ముఖ్యంగా సొంత రాష్ట్రం కర్ణాటకలోనే రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకోలేకపోవడం ఈ సినిమాకు పెద్ద మైనస్‌గా మారిందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.



## 'జైలర్ 2' విడుదలపై వదంతులకు చెక్..

సూపర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమా విడుదలపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఈ చిత్రం వాయిదా పడుతోందంటూ వస్తున్న వార్తలకు చిత్ర నిర్మాణ సంస్థ ఫుల్‌స్టాప్ పెట్టింది. ముందుగా ప్రకటించినట్లే దసరా కానుకగా అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్లు అధికారికంగా స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేసి అభిమానుల్లో జోష్ నింపింది.

2023లో విడుదలై సంచలన విజయం సాధించిన 'జైలర్' సినిమాకు సీక్వెల్‌గా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. అయితే, సినిమా షూటింగ్ పూర్తయినా పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఇంకా పూర్తి కాలేదని, దీనివల్ల సినిమా అనుకున్న సమయానికి రావడం కష్టమంటూ ప్రచారం ఊపందుకుంది. ఈ వార్తలు సోషల్ మీడియాలో జోరుగా చక్కర్లు కొట్టడంతో అభిమానుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో సన్ పిక్చర్స్ సంస్థ ఈ వదంతులను ఖండిస్తూ ఓ కీలక అప్‌డేట్ ఇచ్చింది.

## ఆషికా రంగనాథ్..
# ఆకుపచ్చ అందాల మెరుపులు

నటి ఆషికా రంగనాథ్ తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. 'సర్దార్ 2' చిత్రం ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ట్రైలర్, ఆడియో ఆవిష్కరణ వేడుక కోసం సిద్ధమైన సందర్భానికి సంబంధించిన ఫొటోలను ఆమె అభిమానులతో పంచుకుంది. ఆకుపచ్చ రంగు దుస్తుల్లో ఆషికా రంగనాథ్ ఎంతో అందంగా కనిపించింది. సంప్రదాయం, ఆధునికత కలగలిసిన తన రూపంతో చూపు తిప్పుకోనివ్వని విధంగా మెరిసిపోయింది. సహజమైన చిరునవ్వుతో కెమెరాకు పోజులిస్తూ అభిమానులను ఆకట్టుకుంది. 'సర్దార్ 2' చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు ఇప్పటికే ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆషికా రంగనాథ్ తాజాగా పంచుకున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి. ఆమె అందంపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.



## రూ.200 కోట్ల క్లబ్‌లోకి! 'ఇరుముడి'

మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' చిత్రం బాక్సాఫీస్ వద్ద తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. విడుదలైన కేవలం 12 రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించింది. భావోద్వేగ చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్లిన 'ఇరుముడి', కేవలం నాలుగు రోజుల్లోనే రూ.100 కోట్ల గ్రాస్ మార్కును చేరుకుంది. రవితేజ మార్క్ ఎనర్జీ, శివ నిర్వాణ శైలిలో సాగే కుటుంబ కథాంశం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి సినిమాకు బ్రహ్మరథం పడుతుండటంతో వసూళ్ల ప్రవాహం కొనసాగుతోంది. ఈ అరుదైన ఘనతను పురస్కరించుకుని చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. అన్ని వర్గాల ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరిస్తున్నారని, 'ఇరుముడి' ఒక జనరేషనల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిందని నిర్మాతలు తమ ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు



## కర్లీ హెయిర్ స్టైల్‌తో మెరిసిన అనుపమ



హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ తాజాగా తన కొత్త లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. మెరుపులు అద్దిన గాగ్రా చోళీ ధరించి, కర్లీ హెయిర్ స్టైల్‌తో అందంగా ముస్తాబైన ఆమె ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ఈ ఫొటోలు ప్రస్తుతం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. గాగ్రా చోళీలో అనుపమ మరింత ఆకర్షణీయంగా కనిపించింది. కర్లీ జుట్టు ఆమె రూపానికి ప్రత్యేకమైన అందాన్ని తీసుకొచ్చింది. చక్కటి హావభావాలతో కెమెరాకు పోజులిస్తూ ఫొటోలకు మరింత వన్నె తెచ్చింది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉండే అనుపమ.. తరచూ తనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఈ ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. అనుపమ అందం, కొత్త హెయిర్ స్టైల్‌పై అభిమా నులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# మోడ్రన్ లుక్‌లో 'హుషారు పిట్టలు' భామ

'హుషారు పిట్టలు' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న నటి వాసవి గణేషన్ తాజాగా సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఫొటోలు వైరల్‌గా మారాయి. మోడ్రన్ దుస్తుల్లో స్టైలిష్‌గా కనిపిస్తూ కెమెరాకు పోజులిచ్చిన ఆమె ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సినిమాల్లో సంప్రదాయ, సహజమైన పాత్రలతో కనిపించిన వాసవి.. తాజాగా మోడ్రన్ లుక్‌లో దర్శనమిచ్చి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. విభిన్నమైన దుస్తులు, ఆకట్టుకునే హావభావాలతో ఫొటోలకు పోజులిచ్చింది. ఈ ఫొటోలను వాసవి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అభిమానులు స్పందిస్తున్నారు. ఆమె అందం, స్టైల్‌పై ప్రశంసలు కురిపిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రస్తుతం వాసవి గణేషన్ తాజా ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644



# హాస్యం పండించడంలో సాటి లేని మేటి భమిడిపాటి

## నేడు హాస్య బ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు వర్ధంతి

హాస్య చమత్కార యుక్త మాటలు, సంభాషణలు, రచనల కోసం జీవితాంతం తపించి, తపస్సు చేసి సిద్ధి పొందిన తాపసి భమిడిపాటి కామేశ్వర రావు. వాస్తవానికి ఆయన హాస్య సృష్టి కర్త. అందుకే హాస్య బ్రహ్మగా గుర్తింపు పొందారు. భమిడిపాటి కామేశ్వరరావు (ఏప్రిల్ 28, 1897 – ఆగష్టు 28, 1958) రచయిత, నటుడు, నాటక కర్త. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఏప్రిల్ 28, 1897 సంవత్సరంలో నరసావ ధానులు, లచ్చమ్మ దంపతుల కు జన్మించారు. వీరు భీమవరం లో పాఠశాల విద్యను పూర్తి చేసి, ప్రతిభావంతులైన విద్యార్థుల కిచ్చే ఉపకార వేతనం సహాయంతో, పిఠాపురం మహారాజా కళాశాలలో గణితంలో పట్టా పొందారు. తరువాత కొంత కాలం నరసాపురం, కాకినాడ లలో ఉపాధ్యాయునిగా పని చేశారు. 1922లో ఎల్.టి పరీక్షలో ఉత్తీర్ణులై రాజమండ్రి వీరేశలింగం ఆస్తిక ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర అధ్యాపక పదవిలో స్థిరపడి, అదే పాఠశాలకు రెండు సంవత్సరాలు ప్రధానోపా ధ్యాయ బాధ్యతలను కూడా నిర్వహించారు. ఉపాధ్యా యునిగా పనిచేస్తూ వీరు చాలా నాటకాలు, నాటికలు, కథలు రచించారు. సమకాలీన సాంఘిక సమస్యలను తమ రచనలలో హాస్యరసాను రంజకంగా మలచిన ప్రజ్ఞాశాలి కావడం హాస్య బ్రహ్మ అని కొనియాడ బడ్డారు. త్యాగరాజు రచనలను, జీవితాన్ని చక్కగా పరిశీలించి రాగ, తాళ, వాద్యాలను ఆ గాయకుని భావానికి అనుగుణంగా సమకూర్చుకుని 'త్యాగరాజు ఆత్మ విచారం' రచన చేశారు. తన అభిప్రాయాలకు అనుగుణంగా రచించిన తమ నాటకాలను రాజమండ్రి కళాశాల వార్షికోత్సవాలలో ఆయనే దర్శకత్వం వహించి ప్రదర్శించే వారు. ఆయన స్వయంగా నటులు కూడా. ద్విజేంద్రలాల్ రచించిన 'చంద్రగుప్త'లో శక్తి సింహ పాత్ర పోషణ ద్వారా ఖ్యాతిని పొందారు. కామేశ్వర రావు ఎక్కువగా నాటికలు ముఖ్యంగా హాస్య ప్రధానమైన రచనలు గావించారు. ఆయన నాటికలకు చాలాభాగం ఫ్రెంచి నాటక కర్త మోలియర్ వ్రాసిన నాటికలు ఆధారం. ఆయన అనేక విషయాల మీద వ్రాసిన వ్యాసాలు 20వ శతాబ్దపు మొదటి అర్ధ భాగము లోని సామాజిక పరిస్థితులను తెలియ చేస్తాయి. ఆయన హాస్యం చదువరికి చురుక్కు మనిపిస్తుంది. ఆయన ఉత్తమ మైన హాస్య రచనలతో ఎందరినో మనసారా నవ్వించిన 1958, ఆగష్టు 28 న పరమ పదించారు. భమిడిపాటి కామేశ్వర రావు అనేక హాస్య రచనల నుండి కొన్ని హాస్య పూరకమై, ఈనాటికి సందర్భ సందర్భో చితంగా ఉండేవి .....వాటిల్లో కొన్ని తీసుకుంటే.. మన తెలుగు వ్యాసం నుండి......నూటికి నూరుమంది పైచిలుకు మాట్టాడే తెలుగు కలగాపులగమే. ఈ పులగంలో సంస్కృతం, పార్శీ, ఇంగ్లీషు మాత్రం జోరుగా పడ్డాయి. తెలుగు యొక్క మెత్తదనం వల్లనే ఇన్నిన్ని భాషల పదాలు బాణాల్లాగ హృదయంలో నాటే లాగ తెలుగులో గుచ్చుకుని ఉన్నాయి. తెలుగు శరీరంలో వాటిని నిల్చి ఉండనిస్తే అవి సెలలు వేసి ప్రాణం తీసేస్తాయ ని కొందరూ, లేక వాటిని పైకి లాగిపారేస్తే వెంటనే ప్రాణం పోకట అని కొందరూ. పరీక్షలు వ్యాసం నుండి...పరీక్షల కోసం, మార్కుల కోసం మాత్రమే బాధపడే వాడికి, విద్య అంటదు. విద్యకోసం పాటుపడే వాడికి పరీక్షవల్ల బాధే ఉండదు. ...జీవితం ఒక పెద్ద నిత్య పరీక్ష. జీవిత పరీక్షకి ఎప్పుడో తయా రు అవుతానులే అనడం కాక, అప్పటికప్పుడు తయారుగా ఉండడం మానవుడి విధి. పాలక సంఘాల్లో ఎన్నికల మజా అన్న వ్యాసం నుండి... జనం పంపిన మీదట పాలక సంఘంలోకి వెళ్ళి, వెంటనే ఆ జనాన్ని మరచి పోడమే ఎన్నికల్లో మజా; ఒకవేళ జ్ఞాపకం ఉంచుకున్నా, ఆ జనుల్లో మొదటి జనుడు తనేగదా అనుకోడం మరీ మజా. ఒకడు పాడు పన్లు చేస్తూ వుంటే, మనం కూడా, నెగ్గా లంటే, అంతకంటే పాడుపన్లు చెయ్యవలసి వచ్చేది ఎన్నిక ల్లోనే. ఎన్నికల నిఘంటువులో అసత్యం అధర్మం, అన్యాయం, ద్రోహం క్రౌర్యం, దారుణం లాంటి మాటలుండవు. గొంతు కేన్సర్ తో జీవిత చరమాంకంలో ఇంట్లో మంచం లో పడివున్న భమిడి పాటిని చూసేందుకు వచ్చిన బంధువు లు, మిత్రులకు ఆయన ఉ న్న పరిస్థితి చూసి కళ్ళవెంట నీళ్ళు వచ్చే సందర్భంలో, అంత బాధలో కూడా "అరే, అప్పుడే ఏడుస్తా రెందుకు... ఆ కన్నీళ్ళకు ఇంకా కొంత సమయం ఉంది" అనే వారంటే భమిడిపాటి హాస్య చమత్కార ప్రియత్వం అర్థం అవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# రాఖీ.. రక్షణకు ప్రతీక.. అనుబంధానికి పండుగ

- శ్రావణ పౌర్ణమికి ఎన్నో విశిష్టతలు
- జంధ్యాల పౌర్ణమి.. నారికేళ పూర్ణిమగానూ ప్రాచుర్యం
- ఉపాకర్మతో వేదాధ్యయనానికి శ్రీకారం
- సోదరుడి క్షేమం కోరుతూ సోదరి కట్టే రక్షాబంధనం
- పురాణ కాలం నుంచి కొనసాగుతున్న పవిత్ర సంప్రదాయం



శ్రావణ పౌర్ణమి అంటే కేవలం రాఖీ పండుగ మాత్రమే కాదు. ఆధ్యాత్మికత, కుటుంబ అనుబంధాలు, వేద సంప్రదాయాలు మేళవించిన విశిష్ట పర్వదినం. హయగ్రీవ జయంతిగా, జంధ్యాల పౌర్ణమిగా, రాఖీ పౌర్ణమిగా, నారికేళ పూర్ణిమగా వివిధ ప్రాంతాల్లో ఈ పర్వదినం ప్రసిద్ధి చెందింది. ప్రాంతాన్ని బట్టి ఆచారాలు మారినా.. రక్షణ, శ్రేయస్సు, అనుబంధం అనే భావనలే ఈ పండుగలో అంతర్లీనంగా కనిపిస్తాయి. వర్షాకాలం రాకను స్వాగతిస్తూ మధుర పదార్థాలను స్వీకరించడం కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయం. వరుణ దేవుడి అనుగ్రహం కోసం కొబ్బరికాయలను సమర్పించే ఆచారం కారణంగా దీనికి 'నారికేళ పూర్ణిమ' అనే పేరు వచ్చింది. ముంబయి సహా పశ్చిమ తీర ప్రాంతాల్లో ఈ రోజున సముద్రాన్ని పూజించి వరుణ దేవుడి కరుణ కోరడం ఆనవాయితీ. పూర్వకాలంలో సముద్రయానాలు, వర్తక కార్యకలాపాలకు కూడా ఈ పర్వదినానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండేది.

### జంధ్యాల పౌర్ణమిగా ప్రత్యేకత

శ్రావణ పౌర్ణమికి వేద సంప్రదాయంలోనూ విశిష్ట స్థానం ఉంది. పూర్వకాలంలో ఉపాకర్మ అనంతరం వేదాధ్యయనాన్ని ప్రారంభించేవారు. ఉపాకర్మ అనేది కేవలం పండుగ కాకుండా వేదాధ్యయనానికి సంబంధించిన ముఖ్యమైన వైదిక కర్మగా భావిస్తారు. యజ్ఞోపవీతంలోని మూడు పోచలకు ఆధ్యాత్మికంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. సృష్టి, స్థితి, లయలకు ప్రతీకలైన త్రిమూర్తులను అవి సూచిస్తాయని సంప్రదాయ విశ్వాసం. జంధ్యాల పౌర్ణమి రోజున యజ్ఞోపవీతాన్ని మార్చుకొని వైదిక కర్మలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఋషులను స్మరించుకుంటూ ఋషి పూజలు, ఋషి తర్పణాలు నిర్వహిస్తారు. గౌతమ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ఠ, కశ్యప, అత్రి మహర్షులను సప్తర్షులుగా పేర్కొనే సంప్రదాయం ఉంది. ఇతర పురాణ గ్రంథాల్లో సప్తర్షుల జాబితాలో భిన్నమైన పేర్లు కూడా కనిపిస్తాయి. యజుర్వేద సంప్రదాయంలో పౌర్ణమి తిథికి, రుగ్వేద సంప్రదాయంలో శ్రవణ నక్షత్రానికి, సామవేద సంప్రదాయంలో హస్త నక్షత్రానికి ఉపాకర్మలో ప్రాధాన్యం ఉన్నట్లు వైదిక సంప్రదాయాలు పేర్కొంటాయి.



### రాఖీ.. ఓ దారమే కాదు

శ్రావణ పౌర్ణమికి ప్రజల్లో అత్యంత ప్రాచుర్యం తెచ్చింది రక్షాబంధనం. సోదరి తన సోదరుడి ముంజేతికి రాఖీ కట్టి అతడి ఆయురారోగ్యాలు, శ్రేయస్సును కోరుతుంది. సోదరుడు తన సోదరికి జీవితాంతం అండగా ఉంటాననే భావనను వ్యక్తం చేస్తాడు. అందుకే రాఖీ కేవలం రంగురంగుల దారం కాదు.. సోదరీసోదరుల మధ్య ప్రేమ, నమ్మకం, బాధ్యతలకు ప్రతీకగా నిలుస్తోంది. రాఖీని పట్టు లేదా నూలు దారాలతో తయారు చేయడం పూర్వపు సంప్రదాయం. కాలక్రమంలో అది రంగురంగుల అలంకరణలతో ఆభరణాన్ని తలపించేలా మారింది. సోదరుడికి బొట్టు పెట్టి, హారతి ఇచ్చి, రాఖీ కట్టడం.. అనంతరం సోదరుడు సోదరికి కానుక అందించడం సంప్రదాయంగా కొనసాగుతోంది.

### పురాణాల్లోనూ రక్షాబంధనం

రక్షాబంధనానికి సంబంధించి పురాణాల్లో పలు కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ధర్మరాజు శ్రీకృష్ణుడిని రక్షణకు మార్గం అడిగినప్పుడు రక్షాబంధన విధిని వివరించినట్లు ఒక కథనం చెబుతుంది. దేవాసుర సంగ్రామ సమయంలో ఇంద్రాణి ఇంద్రుడికి రక్షను కట్టి విజయాన్ని ఆకాంక్షించిన కథ కూడా రక్షాబంధన ప్రాశస్త్యంతో ముడిపడి ఉంది. కాలక్రమంలో రక్షాబంధనం సోదరీసోదరుల అనుబంధానికి ప్రధాన చిహ్నంగా మారింది. రక్తసంబంధం లేకపోయినా ఒక మహిళ పురుషుడికి రాఖీ కట్టి సోదర భావాన్ని వ్యక్తం చేసే సంప్రదాయం కూడా ఏర్పడింది. రాఖీ స్వీకరించిన వ్యక్తి ఆమెకు అండగా, రక్షకుడిగా ఉండాలన్న భావన దీనిలో కనిపిస్తుంది.

### అనుబంధాలకు అక్షయ తోరణం

కాలం మారింది.. జీవన విధానాలు మారాయి.. కుటుంబాలు ప్రపంచంలోని విభిన్న ప్రాంతాలకు విస్తరించాయి. కానీ రాఖీ కట్టే చేతిలోని ఆప్యాయత మాత్రం మారలేదు. చిన్న తోరంతో మొదలయ్యే ఈ వేడుక సోదరీసోదరుల మధ్య జీవితకాల అనుబంధాన్ని గుర్తుచేస్తుంది. అందుకే రాఖీ అంటే చేతికి కట్టే దారం మాత్రమే కాదు.. 'నీకు నేనున్నా' అని ఇచ్చే భరోసా. రక్షణకు ప్రతీక.. అనుబంధానికి చిరునామా.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వేదోద్ధరణ అవతారమే హయగ్రీవుడు

"జ్ఞానానందమయం దేవం, నిర్మలం స్ఫటికాకృతిం, ఆధారం సర్వ విద్యానాం హయగ్రీవ ముపాస్మహే" పురాణేతిహాసాలలో ప్రసిద్ధములైన విష్ణువు అవతారాలలో హయగ్రీవావతారం ఒకటి. దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం శ్రీహరి దాల్చిన అవతారాల్లో హయగ్రీవ అవతారం ఒకటి. సమస్త విద్యలను, జ్ఞానాన్ని పాండిత్యాన్ని అనుగ్రహించే శ్రీ గురుమూర్తి హయగ్రీవ స్వామి. వేదోద్ధరణకై సంభవించిన అవతారమే ఇది. మధుకైటభులు అనే రాక్షసులు వేదాలను దొంగిలిస్తే, విష్ణుమూర్తి హయగ్రీవ అవతారాన్ని ధరించి, ఆ మధుకైటభులను వధించి...వేదాలను రక్షించాడు. హిందూమతంలో, హయగ్రీవ స్వామిని కూడా విష్ణుమూర్తి అవతారముగా భావిస్తారు. గుర్రపుముఖంతో, నరశరీరంతో, చతుర్భుజుడై శంఖచక్రాలను ధరించి వామాంకంలో లక్ష్మీదేవి సహితంగా ఆవిర్భవించిన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే హయగ్రీవ స్వామి. ఆయనలో సకల దేవతలూ కొలువై ఉన్నారని పురాణాలు పేర్కొంటున్నాయి. సూర్యచంద్రులు కళ్ళుగా, దేవతలు ఎముకలుగా, అష్టవసువులు పాదాలుగా, అగ్ని నాలుకగా, సత్యం వాక్కుగా, బ్రహ్మ హృదయంగా... ఇలా ఆయనలోని అణువణువూ దేవతామయమని అంటారు. హయగ్రీవున్ని జ్ఞానమునకు, వివేకమునకు, వాక్కుకు, బుద్ధికి, అన్ని విద్యలకు దేవుడుగా భావిస్తారు. హయగ్రీవ స్వామిని చదువుల యొక్క దేవుడుగా పూజిస్తారు. జ్ఞానం, వాక్కు, ఆచారము నాశనం కాకుండా సాగునట్లు అనుగ్రహించిన హయగ్రీవ మూర్తిగా శ్రావణ పూర్ణిమ నాడు మహా విష్ణువును కొలవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. హయగ్రీవుడనగా గుర్రం శిరస్సు, మానవ దేహం కలిగిన స్వామి, నరసింహ స్వరూపం వలే వైకుంఠ నాథుడు హయగ్రీవ ధారియైనారు. 'హయ' అనగా విజ్ఞానం . 'గ్రీవ' అనగా కంఠం. అన్ని విద్యలూ కంఠస్థమై ఉన్న సర్వ విద్యా రూపమే హయగ్రీవ మూర్తి. భాగవతంలో సప్తమ స్కంధంలో హయగ్రీవుడు బ్రహ్మ చేసిన యజ్ఞంలో ఆవిర్భవించినట్లు, స్కంద పురాణంలో దేవతల ప్రార్థనలతో విష్ణువు అశ్వముఖులై అవతరించినట్లు, పూర్వగాథాలహరి లోనూ హయగ్రీవ వృత్తాంతాలు పేర్కొనబడినాయి. దేవీ భాగవతం ప్రకారం ఒకానొక సమయాన మహావిష్ణువు రాక్షసులతో పదివేల ఏళ్ళు భీకర యుద్ధం చేసి అలసి పోయి, అల్లెత్రాడు గట్టిగా బిగించి ఉన్న ధనుస్సును నేలమీద నిలబెట్టి, దాని కోపుమీద తమ గడ్డాన్ని ఆనించి, నిలబడే నిద్ర పోయారు. విష్ణువును వెదకుతూ



వచ్చిన దేవతలు, నిద్ర లేపడానికి భయపడి, బ్రహ్మ దేవుడు ఒక చెద పురుగును సృష్టించి, వింటి నారిని కొరకమని చెబుతారు. పురుగు కొరకడంతో ధనుస్సు విసురుగా తుళ్ళి, వింటికి ఉన్న బాణం కొన విష్ణువు మెడకు తగిలి, ఆయన శిరస్సు తెగి, ఎగిరి పోయింది. దేవతలంతా మహాదేవిని ప్రార్థించగా, ఆమె ప్రత్యక్షమై సూచించిన విధంగా గుర్రాన్ని వధించి, దాని తలను తెచ్చి దేవశిల్పి యైన త్వష్ట ద్వారా విష్ణువు మొండానికి అతికించారు. బ్రహ్మ ప్రాణం పోయగా, హయగ్రీవులైనారు. సృష్టి ఆరంభంలో అగణిత ఏళ్ళ క్రింద చతుర్ముఖ బ్రహ్మకు కు పరమాత్మ వేదశాస్త్రాలను బోధించారు. మధుకైటభులనే ఇరువురు అసురులు, బ్రహ్మ నుండి వేద విద్యను దొంగిలించి, రసాతలానికి పారి పోయారు. హయగ్రీవ రూపంలోని శక్తితో మాత్రమే తాను మరణించునట్లు, హయగ్రీవుడనే రాక్షసుడు, బ్రహ్మ ద్వారా పొందిన వరం కారణంగా, దేవి కృప వల్ల హయగ్రీవ అవతారులైన విష్ణు అదే పేరుగలిగిన అసుర సంహారం చేయడం జరిగింది. తాను చంద్రమండల వాసియైన హయగ్రీవుడు, మహానంద స్వరూపుడు, ఆయన నాసిక నుండి వేదాలు ఆవిర్భవించాయని పురాణ కథనం. హయగ్రీవ విరాట్ స్వరూపాన సత్యలోకం శిరస్సుగా, భూలోకం నాభిగా, పాతాళం పాదాలుగా, అంతరిక్షం కళ్ళుగా, సూర్యుడు కంటి గుడ్లుగా, చంద్రుడు గుండెగా, దిక్పాల కులు భుజాలుగా, అగ్ని ముఖంగా, సముద్రాలు ఉదరంగా, నదులు నదులు, పర్వతాలు ఎముకలు, మేఘాలు కేశాలుగా, సర్వ దేవతా స్వరూపులైనారు. హయగ్రీవుడు తెల్లని శరీరం కలవాడు. లక్ష్మీదేవిని తొడపై కూర్చోబెట్టుకుని, తెల్లని పద్మాసీనులై ఉంటారు. కుడిచేతిలో చక్రం, పై ఎడమ చేతిలో శంఖం, కింది ఎడమ చేతిలో పుస్తకం, కింది కుడిచేయి చిన్ముద్ర ధరించి ఉంటారు. శ్వేతపద్మం సమస్త ఐశ్వర్యాలకు చిహ్నం. చిన్ముద్ర జ్ఞానానికి, పుస్తకం సకల విద్యలకు, శంఖం సకల సృష్టికి కారణభూతమైన నాదానికి, చక్రం అజ్ఞాన సంహారానికి చిహ్నాలు. హయగ్రీవుని ఉపాసించిన వారికి సకలం కలుగుతాయని విశ్వాసం. ఏ దేవతకైనా నామమే శరీరమని, ఆ నామంలోని అక్షరాలే అవయవాలని శాస్త్రవచనం. అందుకే వైష్ణవులకు ఆధ్యాత్మిక విద్యాభ్యాసం హయగ్రీవ నామోపదేశంతో ప్రారంభించడం సంప్రదాయం. హయగ్రీవ నామాన్ని ఉచ్చరించే వారు శివస్వరూపులుగా, పలికిన వారు విష్ణు స్వరూపులుగా, విన్నవారు బ్రహ్మ స్వరూపులుగా అవుతారని బ్రహ్మ చెప్పడాన్ని బట్టి హయగ్రీవ నామ ప్రాధాన్యత స్పష్టం అవుతుంది. భారతావనిలో చాలా చోట్ల హయగ్రీవ ఆలయాలు ఉన్నాయి.హయగ్రీవుని విశాల ఆలయం అస్సాంలో ఉంది. తిరుమల శ్రీహరి ఆలయ మహా ప్రదక్షిణ మార్గంలో శ్రీ లక్ష్మీహయగ్రీవ ఆలయం ఉంది.ప్రతినిత్యం చదువుకునే ఈ లలితా సహస్రనామాలు కూడా హయగ్రీవుని ద్వారానే వచ్చాయి. హయగ్రీవుడు చదువులకు అధిదైవం. మన శాస్త్రాలు అంటే ఎంతో కాలంగా ఆచరించి పొందిన అనుభవాల సారాలు. అందుకే "ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః" చాలా కాలంగా చేసిన ఆచారములే ధర్మములు, అవి మనల్ని రక్షించేవి కనుక వాటిని చెప్పేవి శాస్త్రాలు అయ్యాయి. శాస్త్రాలను బట్టి ఆచారాలు సంప్రదాయాలు ఏర్పడ్డాయి. జ్ఞానం, విద్య, సద్య స్ఫురణ, సృజనాత్మకత కావాలనుకునే వారు హయగ్రీవుని ఆరాధించాలి. హయగ్రీవ జయంతిని శుభప్రదంగా భావించి, అక్షరాభ్యాసం కూడా చేసుకుంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494